NE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 267
మంగళవారం 13 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

కాకినాడ సీఐఐ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 12)
కాకినాడ కేంద్రంగా గోదావరి జిల్లాల్లో పెట్టుబడుల జోరు పెంచేలా సోమవారం నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి నారా లోకేశ్ (మీఠీఠీ రాశీనివంఫ్ల) వెల్లడించారు. ఈ పెట్టుబడులతో 14 వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని తెలిపారు. బ్లూ ఎకానమీ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిలో గోదావరి జిల్లాలు కీలక పాత్ర ▶2లో

వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుమల భక్తుల కోసం 'వెంకటాద్రి' నావిగేషన్ యాప్ ప్రారంభం
రూ.3,222 కోట్లతో తిరుపతిలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం
అలిపిరి వద్ద యాత్రికుల కోసం సమీకృత టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
మాస్టర్ ప్లాన్ రహదారులు, టీటీడీ ఉద్యోగుల లేఔట్ పనుల ప్రారంభం
తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 12)
తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు 'వెంకటాద్రి' పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, కొండపై ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా ఆఫ్‌లైన్, జీపీఎస్ విధానంలో పనిచేస్తుంది. తెలుగుతో సహా ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఆధారిత 'గోవింద' వాయిస్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది లొకేషన్‌ను ట్రాక్ చేసే సౌకర్యం కల్పించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ల నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఈ వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన మరిన్ని కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా), టీటీడీ సంయుక్తంగా చేపట్టనున్న రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి ▶2లో

జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు
నిందిత ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందన్న పురందేశ్వరి
మహిళల భద్రత విషయంలో
కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 12)
జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో కాంగ్రెస్ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన ఘటనపై ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటంపై బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆరోపణ కాదని, నిజమని తేలిన వాస్తవమని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై పురందేశ్వరి మాట్లాడుతూ... "జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో, నిందితుడైన కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు స్పష్టంగా తేలింది. కాంగ్రెస్ ఎంపీపై ఇంతటి తీవ్రమైన నేరం రుజువైనప్పటికీ రాహుల్, ప్రియాంక ఒక్క మాట ▶2లో

విపక్షాలతో సమావేశం.. అధికార విభజన సూత్రానికి విరుద్ధం: సీజేఐ




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 12)
'ఓట్ల చోరీ' అంశంపై వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష నేతలు కోరగా.. అందుకు ఆయన నిరాకరించారు. ఈ విషయంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ఇండియా కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై కాంగ్రెస్ నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీకి మెయిల్‌లో లేఖ పంపినట్లు వెల్లడించారు. సీఈసీ విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందన్నారు. ఒక విషయంపై పిటిషన్ పరిశీలనలో ఉన్నప్పుడు దాని గురించి ఇతరులతో చర్చించడం.. రాజ్యాంగం ప్రకారం 'అధికార విభజన' సూత్రానికి, న్యాయపరమైన ఔచిత్యానికి విరుద్ధమని ▶2లో

మోదీకి 'నెక్ట్స్ పీఎం'' షాక్.. చెన్నై పర్యటనలో కలకలం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 12)
ప్రధాని మోదీ చెన్నై పర్యటన రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. గత పర్యటనలకు భిన్నంగా ఎటువంటి నిరసనలు, ఉద్రిక్తతలు లేకుండా ఈ సారి మోదీ టూర్ ముగిసింది. అదే సమయంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి దళపతి విజయ్ హావాభావాలు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. ఆదివారం చెన్నైకి వచ్చిన ప్రధాని మోదీ సుమారు 13 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇక ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి విజయ్ కలిసి చెన్నై మెట్రోలో ప్రయాణించారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి విజయ్ ముభావంగా ఉండటంపై నెట్టింట విస్తృత చర్చ జరుగుతోంది. ప్రధాని మోదీ ఎప్పుడు చెన్నై వచ్చినా నిరసన ప్రదర్శనలే ఎక్కువగా ఉండేవని అంటున్నారు. అయితే ఈ సారి అటువంటి పరిస్థితి కనిపించకపోయినా, ఐఐటీ మద్రాస్ ▶2లో

విలేకరులు కావలెను



మార్కాపురం జిల్లాలో సొంత ప్రింటింగ్ యూనిట్ తో సాగుతున్న
షణ్ముఖ వెలుగు దినపత్రిక లో పనిచేసేందుకు
ఆసక్తి ఉన్న విలేకరులు సంప్రదించగలరు...

కావలసిన సెంటర్లు
మార్కాపురం టౌన్, మార్కాపురం మున్సిపాలిటీ,
దోర్నాల, గిద్దలూరు, రాచర్ల, అర్థవీడు, కనిగిరి టౌన్
హనుమంతునిపాడు, సి ఎస్ పురం,
వెలిగండ్ల.
Contact : 9494177939, 8332000048



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
E-Paper : www.shanmukhavelugu.com

సీజేపీ తరహాలో ఉద్యమానికి వైసీపీ రెడీ ?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 12)
దేశమంతా సీఈసీ కి వ్యతిరేకంగా ఉద్యమిస్తోంది. ఈ నేపథ్యంలో మొదట్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మద్దతుగా ఒక ట్వీట్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు పారదర్శకంగా ఉండాలని ఆయన ఆ లేఖలో కోరారు. అదే సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం చట్టం 2023ని పునఃసమీక్షించాలని కూడా కోరారు. అయితే దీని మీద ఇండియా కూటమి నుంచి పెద్దగా సానుకూల స్పందన అయితే రాలేదని అంటున్నారు. పైగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఒకరు వైసీపీ స్టాండ్ ని కూడా ప్రశ్నించారు. ఎన్డీయే బిల్లులకు ఒక వైపు మద్దతు ఇస్తూ మరో వైపు ఇలా అంటే ఎలా అని ప్రశ్నించారు. ముందు ఎన్డీయేకి పరోక్ష మద్దతు మానుకోవాలని సూచించారు. దాంతో పాటు ఇండియా కూటమి పార్టీల నుంచి కూడా పెద్దగా రెస్పాన్స్ రాకపోవడంతో వైసీపీ ఆలోచనల్లో పడింది అని అంటున్నారు.
ఏపీ మీదనే ఫోకస్ :అయితే 2024 ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని వైసీపీ మొదటి నుంచి ఆరోపిస్తూ వస్తోంది. అర్ధ రాత్రి మూడు వేల పోలింగ్ బూతులలో అత్యధికంగా ఓటింగ్ జరిగింది అని కూడా పేర్కొంటోంది. పన్నెండు లక్షలకు పైగా ఓట్లు ఆ సమయంలో పోల్ అయ్యాయని విమర్శిస్తోంది. ఇక పోలింగ్ అయిన ఓట్లకు కౌంటింగ్ అయిన ఓట్లకు మధ్య భారీ తేడా ఉంటోందని కూడా వైసీపీ చెబుతోంది. అందువల్ల ఏపీలో జరిగిన ఎన్నికలలో అక్రమాల మీద కూడా జాతీయ పార్టీలు మాట్లాడాలని వైసీపీ నేతలు అంటున్నారు. వారు స్పందించకపోతే తామే సొంతంగా ఉద్యమిస్తామని ఏపీకే పరిమితం అయ్యేలా తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని చెబుతున్నారు.
ముహూర్తం ఎపుడు :ప్రస్తుతం చూస్తే దేశ రాజకీయాల్లో ఓట్ల చోరీ సీఈసీ రాజీనామా సర్ ప్రక్రియలో అవకతవకలు అన్నది అతి పెద్ద రాజకీయ అజెండాగా ఉంది. ఏపీలో కూడా ఇదే సరైన సమయం అని వైసీపీ భావిస్తోంది. అయితే ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల కాబోతోంది. దాంతో వైసీపీ ఎపుడు ఈ అంశం మీద ఉద్యమిస్తుంది అన్నది అయితే ఇప్పటికి అయితే ఏమీ తేలలేదని అంటున్నారు. ఈ విషయంలో ఏదో ఒకటి చేసి ఏపీలో జరిగిన అక్రమాలు పోలింగ్ లో చోటు చేసుకున్న ▶2లో

స్థానిక ఎన్నికలు.. పొత్తు ప్రకారం జనసైనికులు పోటీలో నిలుస్తారు: పవన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 12)
స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకవాడ గ్రామసభలో ఆయన ప్రసంగిస్తూ.. స్థానిక సమరానికి శంఖారావం పూరించారు. స్థానిక ఎన్నికల్లో జనసైనికులు పొత్తు ప్రకారం పోటీ చేస్తారని.. తెదేపా, భాజపా నాయకులకు ఎంత గౌరవం ఇస్తారో, తమ వాళ్లకూ అంతే మద్దతివ్వాలని కోరారు. ▶2లో

జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో ఇంత జాప్యమా?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 12)
'దేశానికి ప్రధాని, ఉప ప్రధానులుగా వ్యవహరించిన వారిపై నమోదైన కేసుల్లోనే మూడేళ్లలో విచారణ పూర్తై, తీర్పులొచ్చాయి. కానీ వైకాపా అధినేత జగన్ అక్రమాస్తుల కేసు విచారణలో ఇంత జాప్యమా? ప్రధాని, ఉప ప్రధానిగా పనిచేసిన వ్యక్తుల కంటే జగన్ గొప్పవారా? చట్టానికి, న్యాయస్థానాలకు, రాజ్యాంగానికి అతీతులా? కోర్టు వాయిదాలకూ హాజరుకారా? డిశ్చార్జి పిటిషన్లు వేసుకుంటూ ప్యాలెస్‌లకు పరిమితమవుతారా?' అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిలదీశారు. ▶2లో

మొదటిపేజీ తరువాయి

వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుపతిని ఒక ఆదర్శ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అలిపిరి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్

ఈ అభివృద్ధి పనుల్లో అత్యంత కీలకమైనది అలిపిరి వద్ద ఎస్వీ జూపార్క్ రహదారిలో నిర్మించతలపెట్టిన సమీకృత యాత్రికుల టౌన్‌షిప్. దీని నిర్మాణానికి సుమారు రూ.2,750 కోట్లు వెచ్చించనున్నారు. తిరుమల కొండపై వసతుల ఒత్తిడి తగ్గించి, తిరుపతిలోనే భక్తులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో పది అంతస్తుల చొప్పున నాలుగు బ్లాకుల్లో 2,700 గదులను నిర్మించనున్నారు. దీని ద్వారా రోజుకు దాదాపు 16 వేల మందికి వసతి అందుబాటులోకి వస్తుంది. రూ.160 కోట్లతో నిర్మించే అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారానికి రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని, రూ.90 కోట్లతో సమీకృత రవాణా టెర్మినల్‌ను నిర్మించనున్నారు.

మౌలిక సదుపాయాల విస్తరణ

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల వ్యయంతో 20 కిలోమీటర్ల పొడవున తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ రహదారులు జాతీయ రహదారుల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు, తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయి. శ్రీవారి సేవలో నిరంతరం పనిచేసే టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 418 ఎకరాల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఔట్లలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉంటే, వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందిస్తారని సీఎం అన్నారు.

సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

తిరుమల తరహా పవిత్రతను తిరుపతిలోనూ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా ఆధ్యాత్మికత, పర్యావరణం, సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నారు. నగరంలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, 'వృక్షో గోవింద' కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో తిరుపతిని వివాహ వేడుకలకు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

కాకినాడ సీఐఐ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు

పోషించేందుకు సిద్ధంగా ఉన్నాయని లోకేశ్ స్పష్టం చేశారు.

ఈ ప్రాంతంలోని పెట్టుబడి అవకాశాలను పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయడమే లక్ష్యంగా కాకినాడలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెబుతూ.. వేగవంతమైన నిర్ణయాలు, పారిశ్రామిక అభివృద్ధికి ఏపీని ఎంచుకోవాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

స్థానిక ఎన్నికలు.. పొత్తు ప్రకారం జనసైనికులు పోటీలో నిలుస్తారు: పవన్

'నేను పార్టీ పెట్టినప్పుడు ఇక్కడి యువతంతా ఎర్ర తువ్వాళ్లు వేసుకుని వచ్చింది. అధికారంలోకి వస్తామో రామో తెలియదు.. వారికి తెలిసింది పోరాటమే.. ఆ ఎర్ర కండువానే ఆయుధం. 2014లో ఒక్క పదవీ ఆశించకుండా కూటమికి పనిచేశారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి చంద్రబాబును జైల్లో పెట్టింది. రోడ్లపైకి ఎవరూ రాని సమయంలో జనసైనికులు, వీరమహిళలు వచ్చి రాష్ట్రానికి భరోసా, ధైర్యం ఇచ్చారు. గత ఎన్నికల్లో నేను రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేశా. స్థానిక ఎన్నికలు మీ భవిష్యత్తు.. మీ అవసరాల కోసం' అని అన్నారు. మూడు పార్టీలూ బాగుండాలని.. ఇప్పటికే జనసేన చాలా త్యాగం చేసిందని.. జనసైనికులు, వీరమహిళలు తగిన ప్రాతినిధ్యం వహించేందుకు అండగా నిలవాలని కోరారు.

జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

కూడా మాట్లాడకపోవడం బాధాకరం" అని అన్నారు.

పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే రాహుల్ గాంధీ, ఈ విషయంలో మౌనంగా ఉంటూ నిందితుడికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడం అంటే నిందితుడిని కాపాడటమేనని విమర్శించారు. ఈ దుష్ప్రవర్తనకు పాల్పడిన ఎంపీని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో బహిష్కరించాల్సిందని, కానీ అతనికి రక్షణ కల్పించడం ద్వారా ఆ పార్టీ ద్వంద్వ వైఖరి బయటపడిందని పురందేశ్వరి దుయ్యబట్టారు.మహిళల భద్రత, గౌరవం పట్ల కాంగ్రెస్ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని ఆమె ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే కఠినమైన చట్టపరమైన, రాజకీయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ మహిళా మోర్చా పురందేశ్వరి నేతృత్వంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టింది.

విపక్షాలతో సమావేశం.. అధికార విభజన సూత్రానికి విరుద్ధం: సీజేఐ

సీజేఐ అన్నారు. అంతేగాక, ఇండియా కూటమి నేతలు తమ లేఖలో ప్రస్తావించిన అంశాలను పరిష్కరించడానికి భారత రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టుకు ఎటువంటి పాలనాపరమైన అధికారాలు లేవని సీజేఐ స్పష్టం చేశారు. అందువల్లే వారి అభ్యర్థనను నిరాకరించినట్లు తెలిపారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఉన్న అధికార పరిధిని వినియోగించుకుంటూ.. భారత పౌరులపై ప్రభావం చూపే విషయాల్లోని ప్రధానాంశాలను పరిశీలించాల్సిన బాధ్యత తమకు ఉందన్నారు. ప్రతిపక్ష నేతలు తమ డిమాండ్లకు సంబంధించి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతేగానీ, సుప్రీంకోర్టును రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలను హెచ్చరించారు. ఎన్‌హెచ్ఆర్‌సీ సమావేశంలో 'నీరు-జీవన అమృతం' అనే అంశంపై మాట్లాడుతూ.. కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు. పౌరుల రాజ్యాంగ హక్కులను నెరవేర్చడానికి వారికి స్వచ్ఛమైన నీటి లభ్యత అత్యవసరమన్నారు. ప్రజలకు మంచి నీరు అందేలా నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. అదే సమయంలో ప్రజల రాజ్యాంగ హక్కులు ఉల్లంఘనకు గురైనప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమకు వచ్చే ఫిర్యాదులపై మానవ హక్కుల కమిషన్లు విచారణ జరిపి, ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో ఇంత జాప్యమా?

జగన్ అక్రమాస్తుల కేసుల్ని రోజువారీ విచారణ జరిపి త్వరగా తేల్చేలా సీబీఐ ప్రత్యేక కోర్టుకు ఆదేశించాలని తెలంగాణ హైకోర్టును కోరుతూ ఈడీ వేసిన పిటిషన్‌పై ఆయన స్పందిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. 'జగన్‌పై నమోదైన కేసుల్లో వందల మంది సాక్షులున్నారు. వారందరినీ రోజువారీ ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారించాలి. ప్రధానిగా పనిచేసిన పీవీ నరసింహారావుపై మూడు కేసులు నమోదైతే.. వాటిపై మూడేళ్లలో విచారణ పూర్తై, కోర్టు తీర్పులు వచ్చాయి. ఓ కేసులో భాజపా అగ్రనేత ఎల్‌కే అడ్వాణీపై కేసు నమోదు కాగా, అది తేలేవరకు పార్లమెంటులో అడుగుపెట్టనని ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. రెండేళ్ల వ్యవధిలోనే తీర్పు వచ్చి, నిర్దోషిగా బయటపడ్డారు. ఆ తర్వాతే ఎన్నికల్లో పోటీచేసి మళ్లీ లోక్‌సభలో అడుగుపెట్టారు' అని సోమిరెడ్డి ఉదహరించారు.

రోజువారీ విచారణ జగన్‌కు ఇష్టం లేదు: 15 ఏళ్ల తర్వాత కూడా రోజువారీ విచారణ జరపడం జగన్‌కు నచ్చడం లేదని సోమిరెడ్డి దుయ్యబట్టారు. 'తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.43 వేల కోట్లకుపైగా అక్రమాస్తుల్ని జగన్ కూడబెట్టారు. అప్పట్లో వైఎస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల లబ్ధి పొందినవారు జగన్ కంపెనీల్లో రూ.వందల కోట్లు పెట్టుబడులు పెట్టారు. దేశంలోనే అతిపెద్ద కుంభకోణమిది. ఈ వ్యవహారంలో రోజువారీ విచారణ కోరుతూ హైకోర్టులో ఈడీ ఎప్పుడో పిటిషన్ వేయాల్సింది. అన్ని కేసుల్లో నిందితుడిగా ఉండి కూడా జగన్ ఐదేళ్లూ సీఎంగా కొనసాగారు' అని సోమిరెడ్డి ఆక్షేపించారు.

మోదీకి 'నెక్ట్స్ పీఎం" షాక్.. చెన్నై పర్యటనలో కలకలం

క్యాంపస్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న తరుణంలో, సీఎం విజయ్ పేరును ప్రస్తావించినప్పుడు సభలోని కొందరు మద్దతుదారులు విజిళ్లు వేస్తూ 'నెక్ట్స్ పీఎం విజయ్ 2029" అన్న ప్లకార్డును ప్రదర్శించడంతో కలకలం చెలరేగింది. ఈ ఊహించని పరిణామంతో ప్రధాని మోదీ ఒకింత షాక్ కు గురయ్యారని అంటున్నారు. మరో వైపు ప్రధాని మోదీ, సీఎం విజయ్ మెట్రోలో ప్రయాణించిన సమయంలో విజయ్ ఎక్కువగా మౌనంగా ఉండటం వైరల్ అవుతోంది. దీనిపై నెట్టింట రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి.తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ తో తెగతెంపులు చేసుకున్న డీఎంకేతో చేతులు కలిపేందుకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ తెగ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటనలో విజయ్ వ్యవహారశైలి ఆసక్తి రేకెత్తించింది. ప్రధాని పర్యటనకు ఒక్కరోజు ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెన్నై వచ్చారు. ఆయనను విజయ్ సాదరంగా ఆహ్వానించారు. అంతేకాకుండా ఇద్దరూ కలిసి మధ్యాహ్న భోజనం చేసి తమ మధ్య అవగాహనను చాటుకున్నారు. కానీ, ప్రధాని పర్యటనలో విజయ్ ముభావంగా ఉండటం చూస్తే బీజేపీ వైఖరి పట్ల ఆయన అంత సౌకర్యంగా లేరన్న సంకేతాలు ఇచ్చినట్లు కనిపించింది.

ఇక ప్రధాని సభలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ ను వేదికపై కూర్చోబెట్టడం కూడా ముఖ్యమంత్రి విజయ్ అసంతృప్తికి లోనయ్యారని అంటున్నారు. గౌరవ పూర్వకంగా తాను ప్రధాని సభకు వెళితే, కేంద్ర ప్రభుత్వం మాత్రం బీజేపీ పార్టీ కార్యక్రమంలా సభను నడిపిందని సీఎం విజయ్ భావించినట్లుగా చెబుతున్నారు. ఈ కారణంగానే చెన్నై మెట్రో రైలులో ప్రధాని తన చుట్టూ ఉన్నవారితో హుషారుగా మాట్లాడుతూ కనిపించినా, విజయ్ కల్పించుకోలేదని అంటున్నారు. దీనిద్వారా ప్రధానితో కలిసి ప్రయాణించడం తనకు ఏ మాత్రం సౌకర్యంగా లేదని ఆయన పరోక్షంగా చెప్పారని అంటున్నారు. ఇది రాజకీయంగా కూడా బీజేపీతో తాను కలిసేది లేదని చెప్పడమేనని అంటున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ డిమాండ్

కంభం ఎలక్ట్రీషియన్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 12)

కంభం మండల ఎలక్ట్రీషియన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం సోమవారం విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో అప్పల బోయిన వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ కె అన్వర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్లు అందించాలని, కార్మికుల పిల్లల చదువుల కోసం ఉపకార వేతనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదవశాత్తు గాయపడి అంగవైకల్యానికి గురైన కార్మికులకు ఆర్థిక నష్టపరిహారం చెల్లించాలని, కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని, ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలోనూ దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల నాయకులు బళ్లారపు రోశయ్య మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలో ఇప్పటివరకు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుని, మంజూరైన కార్మికుల ఖాతాల్లో నగదును వెంటనే జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎలక్ట్రీషియన్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఐ వి సోమయ్య, అధ్యక్షులు అప్పల బోయిన వెంకటయ్య, ఉపాధ్యక్షులు కొనతం సుబ్బారెడ్డి, కే బాలచంద్రుడు, కార్యదర్శి సయ్యద్ రఫీ, సహాయ కార్యదర్శులు ఎస్ కె మహమ్మద్, పోలిశెట్టి ఆంజనేయులు, కోశాధికారి అన్నం వెంకటరామయ్య ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నాయకులు ఆకాంక్షించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న అలగాయపాలెం గ్రామవాసులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 12)

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయాలు అందించడంలో భాగంగా కందుకూరు టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 45 విడత సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో భాగంగా ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ అలగాయపాలెం పాత రెడ్డిపాలెం కు చెందిన సూరిన ఎలమందరెడ్డి, సూరన జయలక్ష్మి అను లబ్ధిదారులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో అలగాయపాలెం టిడిపి నాయకులు వెంకటరామిరెడ్డి, గుమ్మడి శీను, వెల్లేటి వెంకటరామిరెడ్డి, కోమట్ల శ్రీనివాసులు రెడ్డి, పెల్లేటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కాకర్లలో న్యాయ విజ్ఞాన సదస్సు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

ఉచిత న్యాయ సహాయం పై ప్రజలకు అవగాహన

(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 12)

మండలంలోని కాకర్ల గ్రామంలో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు కోర్టుకు చెందిన న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కంభం సీఐ మల్లికార్జున, కంభం ఎస్ ఐ శివకృష్ణారెడ్డి, అర్ధవీడు ఎస్ ఐ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో న్యాయ సేవలు, న్యాయ ప్రక్రియలు, లోక్ అదాలత్ ద్వారా వివాదాల పరిష్కారం వంటి అంశాల పై విస్తృతంగా చర్చించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా, సత్వర న్యాయం పొందేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే అర్హులైన వారికి అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చు ఆదా చేసుకోవచ్చని సూచించారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు చేరువ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.






ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
13.10.26 మంగళవారం

నిర్బంధాలను అధిగమించి..
జయప్రదమైన ఛలో ఒంగోలు

తౌషిక్ మృతిపై సీబీఐ విచారణ జరపాలి
మౌలాబీ మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలి
మందకృష్ణ మాదిగ
కలెక్టరేట్ చుట్టూ బారికేడ్లు
పోలీసుల ఆంక్షలను అధిగమించి మహా ధర్నాలో పాల్గొన్న ప్రజలు
న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రజాసంఘాల స్పష్టీకరణ





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 12)
మార్కాపురం జిల్లా కనిగిరికి చెందిన విద్యార్థి తౌషిక్ అనుమానాస్పద మృతి, ఆయన తల్లి మౌలాబీ మరణానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు, ముస్లిం మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన చలో ఒంగోలు మహా ధర్నా పోలీసుల నిర్బంధాలు, ఆంక్షల మధ్య జయప్రదమైంది. తౌషిక్ మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలని, మౌలాబీ మరణానికి సంబంధించిన కేసులో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ధర్నాకు అనుమతి విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు, నిరసనకారులపై ఆంక్షలు విధించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసుల చర్యలతో ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని గతంలో ఆయన చేసిన విమర్శల నేపథ్యంలో, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్న డిమాండ్ మరోసారి చర్చనీయాంశమైంది. ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు ముందు రోజు రాత్రి నుంచే ప్రజా సంఘాల నాయకులను వారి ఇళ్ల వద్ద నిర్బంధించారు. ఒంగోలు కలెక్టరేట్ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను అడ్డుకున్నారు. గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సైతం రద్దు చేశారు. మహా ధర్నాలో పాల్గొనేందుకు ర్యాలీగా వచ్చిన పలువురు నాయకులను పాత మార్కెట్ సెంటర్ వద్ద అదుపులోకి తీసుకుని చీమకుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినప్పటికీ ప్రజా సంఘాలు, ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ నిరసనను తెలియజేశారు.

4

తౌషిక్ మృతి పై సీబీఐ విచారణ జరపాలి.. తౌషిక్ అనుమానాస్పద మృతికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి రావాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మౌలాబీ మరణానికి దారితీసిన పరిస్థితులపై కూడా నిష్పక్షపాతంగా విచారణ జరగాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, నిరసన తెలిపేందుకు ముందుకొచ్చిన వారిని అడ్డుకోవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తౌషిక్ మృతిపై సీబీఐ విచారణ జరపాలన్న మందా కృష్ణ మాదిగ డిమాండ్, మౌలాబీ మరణానికి సంబంధించిన కేసులో బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్న ఆందోళనకారుల ప్రధాన నినాదంగా నిలిచింది. ఘటనలపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా మున్సిపల్ చైర్మన్‌ల రిజర్వేషన్లు ఖరారు
గజెట్ విడుదల చేసి ఎన్నికల అధికారి సంపత్‌కుమార్ బిసిలకు దక్కని చోటు



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ఉమ్మడి ప్రకాశం, అక్టోబర్ 12)
రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్‌లకు ఎన్నికల అధికారి సోమవారం ఫుల్‌స్టాప్ పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీలకు సంబంధించి రిజర్వేషన్ లను ఖరారు చేస్తూ ఎన్నికల అధికారి సంపత్ కుమార్ గజెట్ విడుదల చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మొత్తం 8 మున్సిపాల్టీలకు రిజర్వేషన్‌లను విడుదల చేశారు. ప్రకాశం జిల్లాలోని అద్దంకి (అన్ రిజర్వ్‌డ్), చీమకుర్తి (అన్ రిజర్వ్‌డ్), దర్శి (అన్ రిజర్వ్‌డ్), కందుకూరు (అన్ రిజర్వ్‌డ్), మార్కాపురం జిల్లాలోని మార్కాపురం (అన్ రిజర్వ్‌డ్), గిద్దలూరు (అన్ రిజర్వ్‌డ్), కనిగిరి (జనరల్ మహిళ), పొదిలి (ఎస్సీ) ▶మిగతా4లో

వైసీపీ అభ్యర్థి పులి శాంతి కూటమి అభ్యర్థి ఎవరు?
కనిగిరిలో సర్వత్రా చర్చ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 11)
కనిగిరి మున్సిపాల్టీ చైర్మన్ పదవి ఓసి మహిళకు కేటాయించిన విషయం విధితమే....ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించడంతో ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిత్వాల పై కసరత్తు ప్రారంభించారు. మాజీ కేంద్రమంత్రి పులి వెంకటరెడ్డి మనవరాలు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పులి శాంతి వైసీపీ అభ్యర్థిగా దాదాపు ఖరారైంది. ఆర్థిక, అంగ బలం ఉన్న పులి శాంతి పోటీకి సై అన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆమె పార్టీ క్యాడర్, తటస్థులు, విద్యావంతులతో తనకు సహకరించాలని ఫోన్‌లలో కోరుతున్నట్లు తెలుస్తుంది. పరామర్శ పేరుతో పులి శాంతిని మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావు, వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌లు పరామర్శించి ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. కనిగిరి మున్సిపాల్టీలో భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులైన పులి శాంతికి పట్టణ ప్రజలంతా సుపరిచితం...అంతే గాక అన్ని వర్గాల వారు గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్నారు. ప్రతి వార్డులో వారికి సొంత వ్యక్తులు ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా పులి శాంతి బరిలో నిలవడం ఖాయమని తేలడంతో అధికార కూటమి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ధీటైన అభ్యర్థి కోసం కసరత్తు చేస్తున్నారు. ▶మిగతా4లో

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలి



జిల్లా కలెక్టర్ ఏం విజయ సునీత
మార్కాపురం, గిద్దలూరు లెక్కింపు కేంద్రాలు,
స్ట్రాంగ్ రూమ్‌లను స్వయంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 12)
జిల్లాలో రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. ▶మిగతా4లో

పట్టిసీమతో రైతులకు భరోసా

ఇనగల్లులో రూ.2.88 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
ప్రతి గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
గుంటూరు ఛానల్ పొడిగింపుతో ప్రతి ఎకరాకు సాగునీరు
వ్యవసాయంతోపాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం
చెన్నకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఏలూరి

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, అక్టోబర్ 12)
పర్చూరు నియోజకవర్గాన్ని వ్యవసాయంతోపాటు పారిశ్రామికంగానూ అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి, గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఇనగల్లు గ్రామంలో రూ.2.88 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. గ్రామంలో రూ.1.50 కోట్లతో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.35 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, రూ.48 లక్షలతో నిర్మించిన స్వర్ణ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పల్లె పండుగ 3.0లో భాగంగా రూ.55 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మహిళలకు డ్వాక్రా రుణాలు కూడా అందజేశారు.





పట్టిసీమతో సాగునీటి భరోసా : ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గిన సమయంలోనూ పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా రైతులకు సాగునీటి భరోసా లభించిందని ఏలూరి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో చేపట్టిన పట్టిసీమ ప్రాజెక్టు పర్చూరు ప్రాంత రైతులకు జీవనాడిగా మారిందన్నారు. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించడం ద్వారా వ్యవసాయానికి నీటి లభ్యతను మెరుగుపరిచే అవకాశం కలిగిందని చెప్పారు. ▶మిగతా4లో

సంతమాగులూరు ఏపీఓ విధుల నుంచి తొలగింపు


4

ఎంపిడిఓ జ్యోతిర్మయి పై క్రమశిక్షణా చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక
సంతమాగులూరు ఫీల్డ్ అసిస్టెంట్ల పై విచారణ
ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

నుంచి 112 వరకు నిర్బంధాలను అధిగమించి.. జయప్రదమైన ఛలో ఒంగోలు

రాజకీయ అండతోనే న్యాయానికి ఆటంకమా?

తౌషిక్ మృతి, మౌలాబీ మరణానికి సంబంధించిన ఘటనల్లో వాస్తవాలు వెలుగులోకి రావాలని వక్తలు డిమాండ్ చేశారు. బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి టీడీపీ, వైసీపీ అండగా ఉంటున్నాయని మందా కృష్ణ మాదిగ ఆరోపణలు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో రాజకీయాలకు తావుండకూడదని, ఘటనకు సంబంధించిన ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరగాలని నిరసనకారులు కోరారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు నిర్బంధించినట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద మహా ధర్నా..

ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో మందా కృష్ణ మాదిగ, ప్రజా సంఘాల నాయకులు వేసేపోగు బాలకోటయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నారాయణస్వామి, పరిటాల కోటేశ్వరరావు, పద్మ, షేక్ సైదా, సతీష్ తదితర ముస్లిం మైనారిటీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. తౌషిక్ మృతి, మౌలాబీ మరణానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజాబాబు కి వినతిపత్రం అందజేశారు. న్యాయం కోసం గొంతెత్తిన వారిని నిర్బంధాలతో అడ్డుకోలేరని నాయకులు స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. పోలీసుల ఆంక్షలు, అరెస్టుల మధ్య కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ధర్నాలో పాల్గొనడం, ఘటనలపై న్యాయం జరగాలన్న డిమాండ్ ప్రజల్లో కొనసాగుతోందని వెల్లడించింది.











సంతమాగులూరు ఏపిఓ విధుల నుంచి తొలగింపు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 12)

సంతమాగులూరు మండలంలో వివిజి రాంజీ పనులలో సుమారు 1500 మంది కూలీల వివరాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయుట విషయంలో అధిక మొత్తంలో నగదు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సంతమాగులూరు ఏపీవోగా పనిచేస్తున్న ఎం బాలకృష్ణ నాయక్ ను తాత్కాలికంగా విధుల నుండి తొలగిస్తూ, వారం రోజుల లోపల తగు వివరణ ఇవ్వవలసిందిగా జిల్లా కలెక్టర్ పి రాజబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా సంతమాగులూరు ఎంపీడీవో జ్యోతిర్మయి పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా పై అధికారులకు నివేదికను సమర్పించారు. సంతమాగులూరులో పనిచేస్తున్న అందరూ ఫీల్డ్ అసిస్టెంట్‌ల పై పూర్తిస్థాయిలో తగు విచారణ చేపట్టి అవకతవకలకు పాల్పడిన వారి పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా మున్సిపల్ ఛైర్మన్‌ల రిజర్వేషన్లు ఖరారు

లుగా నిర్ణయించారు. అయితే బిసిలు అధికంగా ఉన్న మున్సిపాల్టీలో సైతం బిసిలకు ఒక్కటంటే ఒక్క స్థానం కూడా కేటాయించకపోవడం పై బిసి వర్గాలు మండిపడుతున్నాయి. అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బిసిలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోర్టుకు వెళ్ళినప్పటికీ సుప్రీంకోర్టులో కేసు కొట్టి వేయడం జరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ పరంగా బిసిలకు 34 శాతం కు తగ్గకుండా సీట్లు కేటాయిస్తామని చెప్పారు. దీంతో అన్ రిజర్వుడ్ స్థానాల్లో ఎక్కడైనా బిసిలకు స్థానం కల్పిస్తారో లేదో తెలియాలంటే కొద్ది రోజులు ఎదురు చూడాల్సిందే....!

అందరివాడు మాజీ పాత్రికేయ మిత్రుడు షేక్ కాసిం పీరా మృతి



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 12)


మాజీ పాత్రికేయుడు (విశాలాంధ్ర) షేక్ ఖాసిం పీరా (41) ఆదివారం తెల్లవారుజామున గుంటూరులోని ఎన్నారై హాస్పిటల్ లో మృతిచెందాడు. ఈయన తండ్రి షేక్ ఖాసీం పీరా, తల్లి షేక్ ఖాసింబి వీరికి ముగ్గురు కుమారులు అందులో చివరి సంతానమే ఖాసింపీరా ఇతని ఇంటర్మీడియట్ వరకు చదివాడు, తండ్రి రైల్వే స్టేషన్ మాస్టర్ గా ఉద్యోగం చేస్తూ మరణించడం జరిగింది. దీంతో పై చదువులకు వెళ్లకుండా మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామంలోని స్థానిక బస్టాండ్, కేంద్రంలో కూల్‌డ్రింక్ షాపు పెట్టుకుని జీవనం గడిపేవారు, మంచి స్నేహశీలి, దార స్వభావులు, సమకాలీన వార్తలు రాయడంలో మంచిదిట్ట, ఏ వైనా జఠిలమైన సమాచారాన్ని తెలుసుకోవడంలోను, సమస్యాత్మకమైన విషయాను రాబట్టడంలో మంచి మెలకువలు, చాకచక్యము కలిగిన వ్యక్తి, పాత్రికేయ వృత్తిలో అందరితో సోదరాభావంతో అందరివాడిగా మెలిగేవాడు. పాత్రికేయవృత్తిలో ఉన్న అనతికాలంలోనే మండల ప్రజాభిమానాన్ని చూరగొన్న వ్యక్తి, ఈయనకు కొంత కాలం నుండి షుగర్, బీపీ సమస్యలతో బాధపడుతూ ఉండగా ఇటీవల ఊపిరితిత్తుల వ్యాధి సమస్య అధికం కావడంతో నాలుగు రోజుల క్రితం ఎన్నారైలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందడం జరిగింది. ఎన్నారై ఆసుపత్రి నుండి అంబులెన్స్‌లో స్వగ్రామమైన తర్లుపాడులోని ఆయన స్వగృహానికి తరలించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న బంధుమిత్రులు బాధాతప్త హృదయాలతో కన్నీరుమున్నీరయ్యారు. ఈయన భౌతికకాయానికి మండల జర్నలిస్టుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం సభ్యుల బృందం అక్కడికి చేరుకుని సంతాపం వ్యక్తం చేశారు. అంతేకాక గ్రామంలోని ఇరు పార్టీ నాయకులు కూడా సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల సమయంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులతో పాటుగ్రామంలోని ముస్లిం సోదరులు,స్నేహబృందం, శ్రేయోభిలాషులు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి పులి శాంతి కూటమి అభ్యర్థి ఎవరు?

కనిగిరి సిండికేట్ వ్యాపారి జి పవన్ కుమార్ సతీమణి కూటమి తరుపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆర్యవైశ్యుల్లో ఆర్థికంగా ముందు వరుసలో ఉన్న పవన్ సతీమణి గోనుగుంట సుబ్బ లక్ష్మి కుమారి అభ్యర్థిత్వం పై ఆ వర్గం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ అభ్యర్థి రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో రెడ్డి సామాజికవర్గం నుండి కూటమి అభ్యర్థిగా బరిలో నిలిపితే ఎలా ఉంటుందనే ఆలోచనలో ఎమ్మెల్యే ఉగ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. పట్టణ పరిధిలోని మాచవరం, చింతలపాలెం, కొత్తపేట, కొత్తూరు, పాతూరులలో రెడ్డి సామాజిక వర్గ ఓట్లు కూడా అధికంగానే ఉన్నాయి. రెడ్డి సామాజికవర్గం నుండి అభ్యర్థిని నిలిపే పరిస్థితిలో పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి సతీమణి తిరుపతమ్మ కూడా ఛైర్మన్ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఛైర్మన్ పదవి ఓసి మహిళకు కేటాయించడంతో కేటిఆర్ విద్యాసంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి సతీమణి శారదకు ఛైర్మన్ టిక్కెట్ ఇస్తే ఎలా ఉంటుందని ఎమ్మెల్యే ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కుందురు తిరుపతిరెడ్డితో మాట్లాడినట్లుగా వినిపిస్తుంది. కేటిఆర్ సతీమణి బరిలో ఉంటే వైసీపీ క్యాడర్ కొంత కేటిఆర్ కు సహకరించే పరిస్థితులు ఉన్నాయనే చర్చ సాగుతోంది. కనిగిరిలోని దేవకి కుటుంబానికి కేటిఆర్‌తో మంచి సంబంధాలున్నాయి. అంతే గాక మాచవరంలో వైసీపీ క్యాడర్ ను కూడా తన వైపు తిప్పుకునే సత్తా కేటిఆర్‌కు ఉండడంతో ఆయన సతీమణి అభ్యర్థిత్వం సోమవారం నుండి తెరపైకి వచ్చింది. ఇదిలా ఉండగా బిసిలకు 34 శాతం సీట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆ పరిస్థితుల్లో జనరల్‌కు కేటాయించబడిన సీట్లలో కూడా బిసిలకు టిక్కెట్లు ఇచ్చే పరిస్థితులు ఉన్నాయి. కనిగిరిలో బిసికి కూటమి పార్టీలు టిక్కెట్ కేటాయిస్తే పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్ కుటుంబం నుండి పోటీలో నిలిపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని ఫోన్‌లలో పులి శాంతి ప్రచారం ప్రారంభించడంతో టిడిపి అభ్యర్థిని వెంటనే ప్రకటించి అభివృద్ధే అజెండాగా ప్రజల్లోకి వెళ్ళాలని కూటమి నేతలు భావిస్తున్నారు. కనిగిరి మున్సిపాల్టీలో 32 వార్డులుండగా ఎస్టీలకు 2, ఎస్సీలకు 4, బిసిలకు 10, ఓసి మహిళ 8, ఓసి జనరల్ 8 రిజర్వు అయ్యాయి. ఏఏ వార్డులు ఏ కాటగిరికి రిజర్వు అయ్యాయో రెండు రోజుల్లో ప్రకటన వెలువడనుంది. కనిగిరి పట్టణంలో వైసీపీ అభ్యర్థి పులి శాంతి అని టిడిపి అభ్యర్థి ఎవరనే చర్చ సర్వత్రా సాగుతోంది.

పట్టిసీమతో రైతులకు భరోసా

ఇనగల్లులో రూ.2.88 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

గుంటూరు ఛానల్ పొడిగింపే లక్ష్యం

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే పనులను వేగవంతం చేసి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుకు రూ.275 కోట్ల నిధులు మంజూరై, టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టినట్లు చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రక్రియను రద్దు చేయడంతో పనుల్లో జాప్యం జరిగిందని విమర్శించారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఛానల్ పొడిగింపును పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్దపీట

పర్చూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యమని ఏలూరి పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించడం గ్రామాల ప్రగతికి దోహదపడుతుందని చెప్పారు. ఆలయాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, దాతలను భాగస్వాములను చేస్తూ ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో పర్చూరు నియోజకవర్గానికి రూ.275 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, అనంతరం వైకాపా పాలనలో పలు పనులు ముందుకు సాగక అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలి

సోమవారం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జిల్లా ఎస్పీ పంకజ్‌కుమార్ మీనాలు మార్కాపురం నగరంలోని ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల, గిద్దలూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) హాళ్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి కేంద్రంలోనూ భద్రత, లైటింగ్, సీసీ కెమెరాల నిఘా, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక వసతులు లోపం లేకుండా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద త్రీ-టైర్ (మూడు అంచెల) భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా, ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ప్రజల వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

చీమకుర్తి గ్రానైట్ వ్యర్థాల శాశ్వత పునర్వినియోగానికి జిల్లా కలెక్టర్ పి రాజా బాబు వినూత్న చొరవ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 12)

ప్రకాశం జిల్లాలోని సహజ ప్రాకృతిక వనరులను పరిరక్షిస్తూ, పర్యావరణ పరిరక్షణకు, పారిశ్రామిక అభివృద్ధికి నడుమ సమతుల్యత సాధించేందుకు ప్రకాశం జిల్లా యంత్రాంగం సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. సుమారు నాలుగు దశాబ్దాలుగా జిల్లాలోని చీమకుర్తి పరిసర ప్రాంతాలలో విస్తరించి ఉన్న ప్రసిద్ధ గ్రానైట్ గనులు, క్వారీలు, పాలిషింగ్ పరిశ్రమల ద్వారా నిత్యం వెలువడుతున్న వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ బృహత్తర ప్రణాళికను ఆచరణలోకి తీసుకువచ్చే క్రమంలో సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థ డైరెక్టర్‌తో జిల్లా కలెక్టర్ ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజా బాబు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా చీమకుర్తి కేంద్రంగా నడుస్తున్న భారీ గ్రానైట్ పరిశ్రమల వల్ల వెలువడే వ్యర్థాల నిర్వహణ ఒక ప్రధాన సవాలుగా మారిందని పేర్కొన్నారు. గ్రానైట్ పాలిషింగ్ ప్రక్రియలో వైట్ లిక్విడ్ రూపంలో నిత్యం టన్నుల కొద్దీ ఉత్పత్తి అయ్యే తడి వ్యర్థాలు (గ్రానైట్ స్లర్రీ) మరియు పాలిషింగ్ సమయంలో వచ్చే రాతి ముక్కలు, ఇతర ఘన వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యర్థాలు పెద్ద ఎత్తున నిల్వ ఉండటం వల్ల పరిసర ప్రాంతాల్లోని భూములు వ్యర్థాల దిబ్బలుగా మారి దుర్వినియోగం అవ్వడమే కాకుండా, ఎండిన స్లర్రీ నుండి వచ్చే ధూళి, నీటి కాలుష్యం వల్ల స్థానిక పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని వివరించారు. ఈ క్లిష్టమైన పర్యావరణ, భూసమస్యల పరిష్కారానికి సైంటిఫిక్ అప్రోచ్ (శాస్త్రీయ విధానం) అవసరమని భావించిన కలెక్టర్, సిఎస్ఐఆర్, ఏఎంపిఆర్ఐ డైరెక్టర్ సైంటిస్టుల బృందాన్ని సంప్రదించారు. చీమకుర్తిలోని క్వారీలు, పాలిషింగ్ యూనిట్ల నుండి ఉత్పత్తవుతున్న ఈ స్లర్రీ, రాతి వ్యర్థాల పైన సమగ్రమైన పరిశోధన నిర్వహించాలని వారిని కోరారు. ఆ పరిశోధనా ఫలితాల ఆధారంగా ఈ వ్యర్థాలను ఇతర రకాల పర్యావరణహిత నిర్మాణ సామగ్రికా, ప్రత్యామ్నాయ ఉత్పత్తులుగా ఏ విధంగా మార్చవచ్చో సమగ్ర నివేదికను, తగిన మార్గదర్శకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. సాంకేతిక ఆధారిత పరిశోధన పూర్తయిన తర్వాత, వారి ఇచ్చే సూచనలు, వినూత్న పద్ధతుల మేరకు జిల్లా వ్యాప్తంగా వ్యర్థాల నిర్వహణ చర్యలు చేపడతామని కలెక్టర్ తెలియజేశారు. దీని ద్వారా కాలుష్యాన్ని పూర్తిగా నివారించడమే కాకుండా, వ్యర్థాలతో కప్పడిపోయిన విలువైన ల్యాండ్ (భూమి)ని తిరిగి పూడ్చి వేరే ఉపయోగకరమైన కార్యక్రమాలకు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ మదన్ మోహన్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





రూ.2.42 కోట్లతో బిటి రోడ్డుకు శంకుస్థాపన





(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, అక్టోబర్ 12)

గొట్లగట్టు నుంచి లింగారెడ్డిపల్లి వెళ్లే రహదారి 30 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో రూ. 2.42 కోట్లతో బిటి రోడ్డు ను సోమవారం గొట్టిపాటి సూరి కొబ్బరికాయ కొట్టి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో గొట్లగట్టు మాజీ సర్పంచ్ పెరికే సుఖదేవ్ (బూన్), నాయకులు తిరుపతయ్య, పరిటాల సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

రావులకొల్లు గ్రామంలో పిజిఆర్ఎస్





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, అక్టోబర్ 12)

పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామపంచాయతీలో మండల స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభలో మండల ప్రత్యేక అధికారి పి నాగమణి, ఎంపీడీవో డిప్యూటీ తాసిల్దార్, మండల విద్యాశాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారి హౌసింగ్ ఏఈ, అంగన్వాడి సూపర్వైజర్, ఇతర మండల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పులి శాంతిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 12)

కనిగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పులి శాంతి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు సోమవారం కనిగిరిలోని శాంతి నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకొని ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పులి రాధాకృష్ణారెడ్డి, సిరుపా గోవర్ధన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు షేక్ ఫయాజ్, పోలిచర్ల రహీమ్ బాషా, రషీద్, మార్తల రాముడు, హరి, షేక్ షరీఫ్, రహీమాన్, కరీముల్లా, కె వెంకట నరసయ్య, ఎస్ అంజనాద్రి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం ఆగదు ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 12)

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధికారులను హెచ్చరించింది. సోమవారం పొదిలి డిపో ఆవరణలో అధికారులు అవలంబిస్తున్న యూనియన్ పక్షపాత చర్యలకు నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. దీక్షాపరులు ఎంప్లాయిస్ యూనియన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌కే భాష, కండక్టర్ ఎస్‌కె సైదావలి లకు రీజియన్ నాయకులు పిఐఎన్ రెడ్డి, అబ్రహంలు పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. దీక్ష కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిఎం నిబంధనలకు విరుద్ధంగా చార్ట్ బ్లాంక్లను గురించి అమలు చేయుటను వెంటనే నిలిపివేయాలని, బస్సులు స్క్రాప్ కావడం వలన సర్వీసులు కోల్పోయి, స్పేర్లో ఉంటూ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నందున, క్రొత్తగా చాట్లు వేసి సీనియర్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా గ్యారేజీ ఉద్యోగుల ఖాళీలను న్యాయబద్ధంగా భర్తీ చేయాలని టిఐ 3 సుబ్బయ్య యూనియన్ పక్షపాతి వైఖరిని అవలంబిస్తూ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. వారి పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చి ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ డిఎం సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపలేదన్నారు. ఒక యూనియన్‌కు కొమ్ము కాస్తున్నారన్నారు. ఇప్పటికైనా డిఎం స్పందించి మా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యడల సమస్య పరిష్కరించే వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి డిపో అధ్యక్షులు ఎండిఏ బాజీ అధ్యక్షత వహించగా పలువురు నాయకులు, మహిళా ఉద్యోగులు, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, అధిక సంఖ్యలో హాజరయ్యారు.

రామాయపట్నం పోర్టును ప్రభుత్వమే నిర్వహించాలి

పోర్ట్ పునరావాస గ్రామాల జాబితాలో రామాయపట్నం, చేవూరులను చేర్చాలి
18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు యూత్ పాలసీ అమలుచేయాలి
కందకూరు సబ్ కలెక్టర్ హిమవంశీని కలిసిన సిఐటియు ప్రతినిధిబృందం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 12)

రామాయపట్నం వద్ద 4929.39 వేల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వంచే నిర్మించబడుతున్న పోర్టును 50 సంవత్సరాల పాటు ప్రైవేట్ సంస్థకు అప్పగించటం కోసం పిపిపి పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెండర్లను రద్దుచేసి ప్రభుత్వమే నిర్వహించాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం. రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం రామాయపట్నం పోర్టును ప్రభుత్వమే నిర్వహించాలని, రామాయపట్నం, చేవూరులను పోర్ట్ నిర్వాసిత గ్రామాల జాబితాలో చేర్చాలని సిఐటియు ప్రతినిధిబృందం యం రమేష్, జివిబి కుమార్, యస్ఎ గౌస్, కొట్టె వెంకయ్యలు కందుకూరు సబ్ కలెక్టర్ డి హిమవంశీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సంధర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజా ధనంతో 80.55శాతం పూర్తయిన రామాయపట్నం పోర్టును మరో 20 శాతం పూర్తిచేసి పోర్టును నడపవల్సిన సమయంలో పిపిపి పద్ధతిలో ప్రవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లను ఎవరి ప్రయోజనం కోసం వేస్తున్నారన్నారు.ఈ టెండర్లతో పోర్ట్ ప్రవేటీకరణ కావించబడి జిల్లా అభివృద్ధికి శరాఘాతంగా మారుతుందన్నారు. ఇప్పటికే సేకరించిన 850 ఎకరాల భూమితో పాటు రెండోదశలో సేకరించనున్న 2924 ఎకరాల భూమి అంతా సంవత్సరానికి ఎకరా 1రూపాయి లీజుకి 50 సంవత్సరాలపాటు ప్రవేట్ సంస్థ పరమవుతుందన్నారు. ప్రభుత్వ పెట్టుబడితో 80 శాతం పూర్తి చేసిన పోర్టును ఎటువంటి పెట్టుబడి లేకుండా కేవలం 12 శాతం రెవిన్యూ షేరుతో పోర్టు వాణిజ్య కార్యకలాపాలను మొత్తం నిర్వహణను ప్రవేట్ సంస్థలకు 50 సంవత్సరాల పాటు అప్పగించటం అదానీ లాంటి కార్పోరేట్ సంస్థ లాభాల కోసం తప్ప జిల్లా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదన్నారు. ఫలితంగా ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోవటమేకాక భూనిర్వాసితులు, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలన్న నిబంధన అమలుకునోచుకోక తీవ్రంగా నష్టపోతారు.రామాయపట్నం, చేవూరు గ్రామాలు పోర్ట్ నిర్మాణంతో ఖాళీ చేయాల్సి వస్తున్నా పోర్టు నిర్వాసిత గ్రామాల జాబితాలో లేక నష్టపోతున్నారన్నారు. పోర్టు రహదారి నిర్మాణంలో 13.94 ఎకరాల భూములు కోల్పోయిన దళిత రైతులకు నేటికి పరిహారం అందలేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులందరికి యూత్ పాలసీ అమలుచేయాలన్నారు. పునరావాస కాలనీలలో స్మశానసమస్యలు, నీటి సమస్యను పరిష్కరించాలన్నారు.పోర్ట్ నిర్వాసితులు, భూములు కోల్పోయినవారికి, స్థానికులకు పోర్టులో ఉపాధి కల్పించాలని అన్నారు.

శ్రీ ఈశ్వరీదేవి ఆశ్రమంలో వైభవంగా దసరా వేడుకలు





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 12)

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి కుమ్మరకొట్టాల శ్రీ ఈశ్వరీ దేవి ఆశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఉదయం నుంచే ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, గాయత్రీ హోమం, పూర్ణాహుతి తదితర ధార్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ గోవిందేన్నె సుబ్బరాయుడు స్వాములవారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు కొనసాగుతున్నాయి. కమ్మర వెంకట రాజేష్ ఆచారి, గోవిందేన్నె నాగరత్న చారి, గోవిందేన్నె చిన్న బ్రహ్మయ్య చారి, సి.వి. నాగేశ్వరరావు మరియు ఇతర కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీర్థప్రసాదాలు అందజేశారు.అలాగే సాయంత్రం 6:30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పారాయణం, కుంకుమార్చన, మహా దీపారాధన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు,అల్పాహారం ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తాదులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, గాయత్రీ దేవి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆశ్రమ పీఠాధిపతులు, కార్యనిర్వాహక కమిటీ కోరింది.

మొక్కజొన్న రైతుల బకాయిల సమస్య పై విచారణకు ఆదేశాలు

వికలాంగ వృద్ధుడి వద్దకు స్వయంగా వెళ్లి ఫిర్యాదు స్వీకరించిన మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 60 ఫిర్యాదుల స్వీకరణ

రైతులకు మొక్కజొన్న పంటకు సంబంధించిన డబ్బులు చెల్లించలేదని పెద్దారవీడు మండల రైతుల ఫిర్యాదు.

రైతులతో స్వయంగా మాట్లాడి సమస్య వివరాలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ

65 సంవత్సరాల వికలాంగ వృద్ధుడి వద్దకు కార్యాలయం నుంచి బయటకు వచ్చి ఫిర్యాదు తీసుకున్న జిల్లా ఎస్పీ

సంబంధిత పోలీసు అధికారులతో విచారణ జరిపించి, చట్టప్రకారం తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 12)

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మార్కాపురం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 60 ఫిర్యాదులను స్వీకరించారు. మొక్కజొన్న రైతుల సమస్య పై ప్రత్యేకంగా స్పందించిన ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పెద్దారవీడు మండలానికి చెందిన రైతులకు సంబంధించిన మొక్కజొన్న పంట డబ్బులు చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. తమకు మొక్కజొన్న విత్తనాలు అందించి, పంట పండిన అనంతరం కొనుగోలు చేసినప్పటికీ, పంటకు సంబంధించిన డబ్బులు చెల్లించలేదని వారు తమ సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ఫిర్యాదును పరిశీలించిన జిల్లా ఎస్పీ వారితో స్వయంగా మాట్లాడి సమస్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపించి, వాస్తవాలను పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

వికలాంగ వృద్ధుడి వద్దకు స్వయంగా వెళ్లి ఫిర్యాదు స్వీకరణ

దోర్నాల మండలం బోడే నాయక్ తండాకు చెందిన 65 ఏళ్ల వికలాంగుడు, నిరుపేద అయిన బాలాజీ నాయక్ ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. ఆయన పరిస్థితిని గమనించిన జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా కార్యాలయం నుంచి స్వయంగా బయటకు వచ్చి, ఆయన వద్ద నుంచి ఫిర్యాదును స్వీకరించి, అందులోని వివరాలను చదివి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వృద్ధుడి సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సదరు ఫిర్యాదుపై విచారణ జరిపి, చట్టప్రకారం తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని దోర్నాల పోలీస్ స్టేషన్ ఎస్ఐని ఆదేశించారు.

ప్రతి ఫిర్యాదు పై గడువులోగా చర్యలు తీసుకోవాలి

పిజిఆర్ఎస్‌లో స్వీకరించిన ప్రతి ఫిర్యాదు పై సంబంధిత అధికారులు సమగ్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి, నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. బాధితులకు న్యాయం అందించే విషయంలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించడం, అర్హులైన బాధితులకు చట్టపరిధిలో న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అడ్మిన్ నవజ్యోతి మిశ్రా, మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తర్లుపాడులో మార్కాపురం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిమెంటు బెంచీల ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 12)

తర్లుపాడు గ్రామ ప్రజల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు జగన్‌బాబు ఆధ్వర్యంలో 9 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మెయిన్ బజార్‌లోని రామాలయం దగ్గర 2 బెంచీలు, సాయిబాబా గుడి దగ్గర 2 బెంచీలు, సచివాలయం దగ్గర 2 బెంచీలు, బీసీ కాలనీలో 2 బెంచీలు, మండల విద్యాశాఖ కార్యాలయం దగ్గర 1 బెంచ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. వీటిని ప్రజలు సరైన మార్గంలో ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఒక్కో బెంచ్ ఖరీదు రూ.3,500లు అయ్యిందని, ఇందుకు సహకరించిన దాతలకు ప్రతి ఒక్కరికి పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికుల ధర్నా



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 12)

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్మిక సంఘం నాయకులు బండి కోటేశ్వరరావు మాట్లాడుతూ చనిపోయిన, రిటైర్మెంట్, దీర్ఘకాలికంగా అనారోగ్యం పాలైన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు, హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. మినిమం టైం స్కేల్ జీతాలు చెల్లించాలని, మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నాగేంద్రమ్మ, అంజమ్మ పోలేరమ్మ, లింగమ్మ, స్వరూప, లీల, చిన్నక్క, ప్రభావతి, రాజమ్మ, సుబ్బారావు, అంకిత్, ఏడుకొండలు, కార్మికులు పాల్గొన్నారు.

టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు






(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 12)

పట్టణంలోని టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మొదటి సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థినీ, విద్యార్థులకు రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులు ఘనంగా స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని, అనుభవం కలిగిన, ఉన్నత అర్హతలు గల అధ్యాపకులు ఉన్నారని, వారిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వి శ్రీహరి మాట్లాడుతూ కళాశాలలో ఆధునిక ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు, మహిళా సాధికారత విభాగం, జాతీయ సేవా పథకం వంటి అనేక విభాగాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతున్నాయని, ఈ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కెవి పద్మావతి, డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ పి రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. తదనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి.

అలగాయపాలెంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 12)

ఉలవపాడు మండలంలోని అలగాయపాలెం గ్రామానికి చెందిన వాయల పుష్ప ఇంటిలో నిన్న అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పూరింటికి నిప్పు అంటుకుంది అని పక్కింటివారు చెప్పడం తో మంటలు ఆర్పారు. విషయం తెలుసుకున్న వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశవరపు జాలి రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని, ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, తన వంతుగా కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కటారి శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసమూర్తి, తెడ్డు శ్రీనివాసుల రెడ్డి, వాయల బాబు, కటారి తిరుపతి, కరేడు గ్రామ అధ్యక్షులు రామాల కృష్ణారెడ్డి, పీతా రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొక్కిలగడ్డ వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.







ప్రజా సమస్యలకు నాణ్యమైన, త్వరితగత పరిష్కారం అందించడమే ధ్యేయం

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 142 అర్జీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 12)

ఒంగోలు నగరంలోని ప్రకాశం భవనంలో గల పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి హాజరై, ప్రజల నుండి నేరుగా వినతులు మరియు ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, జాయింట్ కలెక్టర్ గారు వారితో ఓపికగా మాట్లాడి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వేదికలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 142 అర్జీలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీ పట్ల అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపలే ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. అర్జీలను కేవలం సాంకేతిక కారణాలతో తిరస్కరించడం సరికాదని, ప్రతి అర్జీ నీ క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సమగ్రంగా విచారించి బాధితులకు పూర్తి స్థాయి సంతృప్తినిచ్చేలా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని ఆమె ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం రాకూడదని, పునరావృతమయ్యే ఫిర్యాదులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, స్థానిక సంస్థలు మరియు ఇతర సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదుల పురోగతిని తాను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని, విధుల్లో అశ్రద్ధ వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) ఆర్ వెంకటరమణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి మాధురి, బీసీ కార్పొరేషన్ ఈడి జి. వెంకటేశ్వరరావుల తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





జీజీహెచ్‌లో అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ ఆకస్మిక తనిఖీ

పలు వార్డులను పరిశీలించి రోగుల నుంచి వైద్య సేవలపై ఫీడ్‌బ్యాక్ సేకరణ

వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణలో సమయపాలన పాటించాలి

అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 12)

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను పరిశీలించేందుకు ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులను సందర్శించి, రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలను (ఫీడ్‌బ్యాక్) సేకరించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో ఎలా వ్యవహరిస్తున్నారు, రోగులకు అవసరమైన వైద్య సమాచారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అందించే వైద్య సేవలన్నీ ఉచితమని, వైద్య సేవల కోసం ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా అనే విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గైనకాలజీ విభాగం, క్యాజువాలిటీ విభాగాలను పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలను సమీక్షించారు. వైద్యులు, సిబ్బంది నిర్దిష్ట రోస్టర్ ప్రకారం విధులకు హాజరై, తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. షిఫ్టుల వారీగా వైద్యులు అందుబాటులో ఉంటూ, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని విభాగాలకు చెందిన వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓపీ సేవలకు అందుబాటులో ఉండేలా చూడాలని అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ అధికారులను ఆదేశించారు. రోగులకు సకాలంలో వైద్యం అందించడం, సిబ్బంది సమయపాలన, మర్యాదపూర్వక సేవలు, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో అడ్మినిస్ట్రేటర్ వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, ఏఆర్ఎంఓలు డాక్టర్ సునీల్ గవాస్కర్, డాక్టర్ తేజ, డాక్టర్ లక్ష్మా నాయక్ పాల్గొన్నారు.

పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్‌కుమార్‌కు సత్కారం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 12)

పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం రాజేష్‌కుమార్‌ను సోమవారం తన కార్యాలయంలో పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన సంవత్సర కాలంలోనే రాజేష్ కుమార్ ప్రజలందరి మన్ననలు పొందారన్నారు. పట్టణంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్, దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. నిత్యం పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారి పై ఉక్కు పాదం మోపారన్నారు. ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించడంతోపాటు కొనకనమిట్ల మండలం చినారికట్ల గ్రామంలో ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో చిన్నారికట్ల గ్రామంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణ పై రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయించారన్నారు. గంజాయి పై ఉక్కు పాదం మోపారని తెలిపారు. పొదిలి మండల పరిధిలో ఎస్ఐ సూరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో దొంగతనాల పై ప్రత్యేక దృష్టిసారించారని చెప్పారు. నిఘా నేత్రాలు ఏర్పాటు చేసి చోరీ జరిగిన సొమ్మును అనతి కాలంలోనే రికవరీ చేయించారన్నారు. విశ్వనాధపురం ఆర్టీసీ డిపో వద్ద నుండి కూరగాయల దుకాణ వరకు ట్రాఫిక్ రూల్స్ బోర్డులను ఏర్పాటు చేయించారన్నారు. రోడ్డు భద్రత చర్యలో భాగంగా స్థానిక పెద్ద బస్టాండ్, చిన్న బస్టాండ్ సెంటర్లలో మైకుల ద్వారా వాహనదారులకు అవగాహన కలిగించారన్నారు. ఇలా అనేక మంచి పనులు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. సిఐని సత్కరించిన వారిలో జర్నలిస్టు క్లబ్ అధ్యక్షులు చప్పిడి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి విశ్వనాధం, కోశాధికారి ముల్లా హసన్‌వలి (బడే), సహాయకార్యదర్శి ఓబులశెట్టి రాధాకృష్ణ, బాజీ, వడ్డే వేణు, అశోక్ బండి, నర్రా వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, అహ్మద్, బెంజిమెన్, తదితరులు ఉన్నారు.

కలవళ్లలో పసుపు జెండా రెపరెపలు

జై కొట్టిన ఆదిఆంధ్ర కాలనీ

ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో పార్టీలో చేరిన 45 కుటుంబాలు

రూ.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభోత్సవం

(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, అక్టోబర్ 12)

మండలంలోని కలవళ్ల గ్రామం సోమవారం పసుపు జెండాలతో రెపరెపలాడింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పనితీరు, నిబద్ధత పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు మద్దతుగా 45 కుటుంబాలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదిఆంధ్ర కాలనీకి చెందిన జడ ఆనంద్, అంకయ్య, యాకోబు, ఇమ్మానుయేలు, నరసింహ, దప్పలపూడి దావీదు, బ్రహ్మయ్య తదితర కుటుంబాల వారు వైసీపీని వీడి, నాగేశ్వరరావుకు మద్దతు తెలిపారు. దీంతో కాలనీ మొత్తం తెలుగుదేశం పార్టీ చెంతకు చేరినట్లయింది. అంతకుముందు గ్రామంలో 50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యేపై పూలు చల్లుతూ, అభిమానం చాటుకున్నారు. తప్పెట్లు, వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కలవళ్ల గ్రామం అంటే నాకు ప్రత్యేక అభిమానం. ఇక్కడ వారందరితో నాకు పరిచయాలు ఉన్నాయి. ఎమ్మెల్యేగా గెలిచాక గ్రామంలో 80 లక్షలతో సిసి రోడ్లు నిర్మించాను. 3.5 కోట్లతో విఆర్ కోట వరకు తారు రోడ్డు ఏర్పాటయింది. సీఎం రిలీఫ్ ఫండ్ కింద 28 మందికి 34 లక్షల ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. రాబోయే రెండేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయి. పార్టీలో ఉన్నవారు, కొత్తగా చేరిన వారు కలిసి, పార్టీకోసం పని చేయాలి. రాబోయే ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటిసి పదవులు కైవసం చేసుకోవాలి. తద్వారా 2029 ఎన్నికల్లో మళ్లీ నన్ను ఆశీర్వదించాలని అందరినీ కోరుకుంటున్నానని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షులు మోదేపల్లి నరసింహం, స్థానిక నాయకులు మోదేపల్లి నారాయణ, రవి, శ్రీను, లక్ష్మీనారాయణ, బ్రహ్మయ్య, స్వర్ణ చిననాంచారయ్య, మురళి, పువ్వాడి వెంకటసుబ్బయ్య, జడ ఎలీషా, నాగేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ ఘట్టమనేని లక్ష్మీనరసింహం, మన్నం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.













మహాత్మాగాంధీ జాతీయ శాంతి అవార్డు 2026 అందుకున్న డాక్టర్ కుక్కమూడి ప్రసాద్





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)

దుర్గి మండలం ముటుకూరు గ్రామ కాపరస్తుడైన దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, పిసిఆర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ (ప్రసాదరావు)కు మహాత్మా గాంధీ జాతీయ శాంతి అవార్డు 2026 వచ్చిందని ఆయన పత్రికా విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మార్కాపురం జిల్లా ప్రెస్ క్లబ్ నందు గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతిపిత మహాత్మా గాంధీ 157 జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు మహాత్మా గాంధీ జాతీయ పీస్ రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి తెలంగాణా హైకోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్ విశ్వ సాహిత్య వేదిక తెలంగాణ మహిళా చైర్ పర్సన్ పివిపి అంజనీ కుమారి, గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ ఫౌండర్ గాట్టేముక్కల చెన్నకేశవులు చేతుల మీదుగా ఈఅవార్డు అందుకోవటం జరిగిందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు తలపాగ టోపీ పెట్టి శాలవాలతో ఘనంగా సత్కరించి అవార్డు తో పాటు సర్టిఫికెట్, మెమెంటో వారు అందజేశారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత 20 సంవత్సరముల నుండి సామాజిక కార్యకర్తగా సంఘసంస్కర్తగా,దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, ప్రస్తుతం పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా సమాజంలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద ప్రజలకు, అనాధలకు స్వచ్ఛందంగా అందిస్తున్న తన సేవలను గుర్తించి, తన సేవలకు గాను తనకు ఈ అవార్డు అందజేసినందుకు పివిపి అంజనీ కుమారి, గొట్టిముక్కల చెన్నకేశవులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. మహాత్మా గాంధీ జాతీయ పీస్ అవార్డు రావడం సంతోషంగా ఉందని, సమాజంలో మరింతగా సేవలు అందించటానికి నాలో ఉత్సాహాన్ని కలిగించిందని ఆయన అన్నారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన మిత్రులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ ప్రసాద్ కు అవార్డు రావడం పట్ల దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, శ్రీ వీరబ్రహ్మేంద్ర జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గురజాల అప్పారావు, బీసీ నవ చైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి ఈశ్వరయ్య, సీనియర్ దళిత నాయకులు కడియం అన్నారావు, ఆరుమళ్ళ ఇశ్రాయేలు, ఎం సిపిఐ యూ నాయకులు ఎం నాగేశ్వరావు, కుక్కమూడి మరియదాసు, షేక్ జహీరాభి, కడియం శారమ్మ, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మైదుకూరులో రూ.60 లక్షలతో మార్చురీ, పోస్టుమార్టం గదుల నిర్మాణానికి భూమిపూజ



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 12)

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మార్చురీ, పోస్టుమార్టం గదుల నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. జిల్లా ఖనిజ నిధి నుంచి సుమారు రూ.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణాలు పూర్తయితే, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, చాపాడు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, ఎఈ నిరంజన్ రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జులు బండి అమర్నాథ్, తుపాకుల రమణ, సర్వేయర్ బుజ్జి, రామిశెట్టి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పై బాధ్యతాయుతంగా స్పందించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఎన్నికల కార్యక్రమాలపైనా దృష్టి సారించాలి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, అక్టోబర్ 12)

ప్రజా ఫిర్యాదులను బాధ్యతాయుతంగా పరిష్కరించి, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ డాక్టర్ నిధీమీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ల సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా అన్ని శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, సమస్యకు అనుగుణంగా సరైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పొంతనలేని నివేదికలు సమర్పించరాదని హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి, సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి స్థాయిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి అర్జీదారులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ లు రంగస్వామి, వెంకటపతి, శివరామిరెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అంతం చేద్దాం బాలల హక్కులను కాపాడుదాం

బాలికల విద్య, భద్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 12)

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఎంకెఆర్ఎస్టి కాలనీలో ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సహకారంతో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బాలికలు చదువును మధ్యలో ఆపకుండా కొనసాగించాలని, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందించే సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారి హక్కులను పరిరక్షించేందుకు సమాజమంతా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, వివక్ష, ఇతర అన్యాయాలను అరికట్టి, వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ బాలికల దినోత్సవం ప్రాధాన్యతను సంతరించుకుందని పేర్కొన్నారు. “బాల్య వివాహాలను అంతం చేద్దాం–బాలల హక్కులను కాపాడుదాం” అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ప్రతి బాలికకు సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన భవిష్యత్తును అందించేందుకు సమాజమంతా కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు.18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం చట్టపరమైన నిబంధనలకు విరుద్ధమని, బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. బాల్య వివాహాల నివారణతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలికలు, కాలనీవాసులు, పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ వైద్యుడిగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్‌కు రెడ్ క్రాస్ తరుపున బాపట్ల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 12)

ప్రజారోగ్య పరిరక్షణలో నిస్వార్థ సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నుంచి ‘ఉత్తమ వైద్యుని’ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా కలెక్టరేట్లో జరిగిన రెడ్ క్రాస్ సమావేశ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఐఏఎస్, చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని స్వీకరించారు. డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఉప్పలూరు పరిసర ప్రాంతాల ప్రజలకే కాకుండా, బాపట్ల జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీ భవనం నందు కూడా ఎంతో అంకితభావంతో, రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో విశేష వైద్య సేవలను అందించడమే కాకుండా, ఆసుపత్రికి వచ్చే రోగులను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ, అవసరమైన వారికి కౌన్సిలింగ్ అందిస్తూ రోగుల మన్ననలు, అపార అభిమానాన్ని పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ అవార్డు గౌప్పతనం తనది కాదని, తనకు ఎంతగానో సహకరిస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు మరియు సభ్యులకే దక్కుతుందని, భవిష్యత్తులోనూ పేద ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పల్నాడు జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే జూలకంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)

పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అడహల్లిను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి, జగదీష్ కు అభినందనలు తెలిపారు. తాజా పరిణామాలు, పలు అంశాలపై కొంత సమయం చర్చించారు. అనంతరం జిల్లా కటెక్టర్ కృతిక శుక్లా ను కలిసిన ఆయన, వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి జరుగుతున్న భూసేకరణ, అడ్డంకులు వంటి వాటిపై చర్చించారు. అలానే జల్ జీవన్ మిషన్ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో శరవేగంగా నిర్మిస్తున్న పల్నాడు వాటర్ గ్రిడ్ పనులపై సమీక్షించారు.

అశ్రునయనాల మధ్య కానిస్టేబుల్ వీరన్న అంత్యక్రియలు

నివాళులర్పించిన ఎస్పీ బి ఉమామహేశ్వర్

(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, అక్టోబర్ 12)

బాపట్ల జిల్లా ఆర్మ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎల్. వీరన్న మృతితో పోలీస్ శాఖలో విషాదం నెలకొంది. 2013 బ్యాచ్‌కు చెందిన వీరన్న ఆదివారం మృతి చెందగా, సోమవారం వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ రామానగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీస్ శాఖ వీరన్న కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆయన భార్య నాగమణికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పోలీస్ శాఖ అధికారిక లాంఛనాలతో వీరన్న అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







ఆ మండలంలో వార్ వన్ సైడేనా ?



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, అక్టోబర్ 12)

స్థానిక సంస్థల ఎన్నికల వేళ మండలంలో రాజకీయాలు వేడెక్కాయి. వరుసగా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పల్లెల్లో రచ్చబండల వద్ద రాజకీయం రసవత్తంగా మారింది. 15 గ్రామ పంచాయతీలలో టిడిపి, వైసిపి గెలుపు ఓటములపై ప్రజలు ఇప్పటి నుంచే చర్చించుకుంటున్నారు.

ఇదిలా ఉండగా పమిడిపాడు, రావినూతల, మేదరమెట్ల పంటి మేజర్ పంచాయతీలలో తోపాటు రాచపూడి, ప్రాసంగుల పాడు,దైవాలరావూరు, తిమ్మన్నపాలెం, గుడిపాడు, ఎర్రబాలెం, కుర్రవానిపాలెం, చలివేంద్రం, తమ్మవరం, అనమనమూరు పంచాయితీలు టిడిపికి కంచుకోటగా ఉన్నాయని, మొదటినుంచి వైసిపికి కొంతమేర బలంగా ఉన్న కొరిశపాడు, బొడ్డువానిపాలెం గ్రామాలలో కూడా మార్పు రావటంతో వార్ వన్ సైడ్ అవుతుందని టిడిపి నాయకులు అంచనాలు వేస్తున్నారు. ఎంపీటీసీ, జడ్పిటిసి, తో పాటు సర్పంచులు కూడా అన్ని స్థానాల లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే టిడిపి నేతలు కులాల వారీగా నాయకులు, కార్యకర్తలతో ఆయా గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మరొకవైపు మండలంలో వైసీపీని నడిపించే సరైన రథసారధి లేడని ఆ పార్టీ కార్యకర్తలు లో లోపల మదన పడుతున్నారు. కనీసం పోటీ నిలబెడతామా లేదా అని తర్జనభర్జన పడుతున్నారు. ఇదిలా ఉండగా వైసిపి ఇన్చార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఇంతవరకు మండల సమావేశం కూడా నిర్వహించని పరిస్థితి ఏర్పడిందని, గ్రామాలలో పర్యటించినది లేదని తాము ఎలా ముందుకు ఎలా పోవాలని కొంతమంది నాయకులతో పాటు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ఎన్నికల ధమాకా గ్రామాలలో హాట్ హాట్ గా మారింది.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 10 వైసీపీ కుటుంబాలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 12)

మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్లో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో కొనకనమిట్ల మండలంలోని వద్దిమడుగు గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో పిన్నిక పిచ్చయ్య, పిన్నికి అంజిబాబు, బొరుగెల పోలయ్య, దడిగ శ్రీను, మూటుకూరి తిరుపతి స్వామి, ఊటుకూరి వెంకటేశ్వర్లు, తోట బ్రహ్మయ్య, చెన్నుబోయిన కొండ గురవయ్య,గాలం అల్లూరయ్య తదితర కుటుంబాలు చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మార్కాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని, అభివృద్ధి, సంక్షేమం ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నమ్ముతున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే వైసీపీ పార్టీ నుంచి తెలుగుదేశంలోకి వలసలు మొదలయ్యాయని త్వరలోనే ఇవి ఊపు అందుకోబోతున్నాయని, ఇప్పటికే మార్కాపురం జిల్లా సాధించామని, ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదల చేసామని, హార్టికల్చర్ హబ్‌తో త్వరలో రైతుల కళ్ళలో ఆనందం చూస్తామని, ఇంటింటికి త్రాగునీటి పైప్ లైన్ ద్వారా ఎన్నో ఏళ్లుగా తాగునీటికి సైతం ఇబ్బంది పడ్డ మన ప్రాంతంలో త్రాగునీరు ప్రతి ఇంటికి అందించబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి మండవ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్సీ కమీషన్ రాష్ట్ర సభ్యులు మేకల భిక్షం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)

పల్నాడు ప్రాంతంలో మెరికల్లాంటి క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేలా మండవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండవ రవి చేస్తున్న సేవలు అభినందనయమని ఎస్సీ కమిషన్ రాష్ట్ర సభ్యులు మేకల భిక్షం (దాసు) అన్నారు. శనివారం మాచర్లలోని ఎస్ కేబీఆర్ గ్రౌండ్ లో జరుగుతున్న మండవ మాచర్ల ప్రీమియం లీగ్ (ఎంపిఎల్) పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవ రవి మాచర్లలో ఎంతోకాలంగా పేదలకు అవసరమైన సేవలు, ఆర్థిక భరోసాను సైతం అందించారన్నారు. పల్నాడులో ఎందరో ప్రతిభావంతమైన క్రీడాకారులు ఉన్నారన్నారు. సరైన ప్రోత్సాహం లేక క్రీడలకు దూరమవుతున్నారన్నారు. మాచర్లలో ప్రతిష్టాత్మకంగా ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి మండవ మాచర్ల ప్రీమియం లీగ్ క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం మాచర్లలో క్రీడల అభివృద్ధికి నాంది పలుకుతుందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ తమకు నచ్చిన క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. తద్వారా తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు మంచి పేరు తేవాలన్నారు. గెలుపు, ఓటములను సమాన స్థాయిలో స్వీకరించి క్రీడాకారులు స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. పల్నాడులో బ్రహ్మనాయుడు, కన్నమాదాసు నడయడిన నెల అని వారిని ఆదర్శంగా తీసుకుని పల్నాడు ప్రాంతంలో సమైక్యతతో ముందుకు వెళ్లాలన్నారు. మండవ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇదే స్ఫూర్తితో మండవ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రజాసేవలో ముందడుగు వేయలన్నారు. క్రీడల్లో పాల్గొన్ని పత్రికీడాకారున్ని, నిర్వాహక సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. ఈ సంద్భంగా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మండవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ రవి, టిడిపి సీనియర్ నాయకులు కేశవరెడ్డి, ఏం నారయ్య, అన్వర్ పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

వార్డుల పునర్విభజన పై సరైన చర్యలు తీసుకోవాలి

అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులను ఎన్నికల విధుల నుంచి తొలగించాలి

మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్స్, వార్డుల సరిహద్దులు, బూతులు ఏర్పాట్లు అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనివ్వాలి

మున్సిపల్ ఎన్నికల అవకతవకల పై వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో భారీ నిరసన

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 12)

కందుకూరు మున్సిపాలిటీ వార్డుల పునర్విభజనలో జరిగిన ఆవకతవకలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తెలిపిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని వార్డు సరిహద్దులను శాస్త్రియంగా నిర్ధారించి రూపొందించాలని డిమాండ్ చేస్తూ కందుకూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కందుకూరు మున్సిపాలిటీ వార్డుల పునర్విభజన అంశంపై ప్రముఖ పత్రికలో అధికార పార్టీ నాయకులతో కలసి మున్సిపల్ అధికారులు సరిహద్దులు రూపొందించారని వచ్చిన ఆరోపణల పై కమిషనర్ గాని, మున్సిపల్ అధికారులు కానీ స్పందించకపోవడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం అని అన్నారు. కందుకూరు మున్సిపాలిటీ కి సంబంధించిన వార్డుల పునర్విభజన సరిహద్దులు నిర్ణయించటం అవకతవకలతో కూడుకొని ఉన్నది. సరిహద్దులలో పాత ఎనిమిదో వార్డు కొత్త 12వ వార్డులో సరిహద్దులు తప్పుల తడకగా వున్నాయి. ముఖ్యంగా ఆది ఆంధ్ర కాలనీలోని తూర్పు వైపు బజారు, పడమర వైపు బజారులను తొలగించటం వివక్షతో కూడుకున్నది. ఆది ఆంధ్ర కాలనీ ఒకే సామాజిక వర్గానికి చెందిన ఎస్సీ (మాదిగ) వారిని మూడు వార్డులలో విభజించడం వివక్షత చూపినట్లే అని విమర్శించారు. ఐక్యంగా ఉన్న ఎస్సీలను విడగొట్టాలనే దురుద్దేశ్యంతో ఆది ఆంధ్ర కాలనీకి రోడ్డు ప్రక్కనే ఉన్న ప్రాంతాలను వదిలివేసి ఉత్తరం పక్క కిలో మీటర్ దూరంలో ఉన్న రెవెన్యూ కాలనీ కలపడం, అదే విధంగా అర కిలోమీటర్ దూరం ఉన్న కాకుమాని పాలెం అగ్రవర్ణ సామాజిక వర్గానికి చెందిన కాలనీ కలపడం అంటే ఎస్సీ కాలనీ ప్రజలను విభజించి దెబ్బతీయలనే ఉద్దేశం ప్రధానంగా కనబడుతుందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ ప్రజలకు వర్తించే రిజర్వేషన్స్ ను కోల్పోయే పరిస్థితి వస్తుంది. ఇది రాజ్యాంగ విరుద్ధం, మున్సిపల్ యాక్ట్ కు విరుద్ధం అని మాట్లాడారు. పాత 14 వార్డు కొత్త 21వ వార్డులో స్పష్టత లేదు.శ్రీరామ కాలనీలోని తూర్పు వైపు దూరంగా ఉన్న చుట్టుగుంట, గల్లా వారి పాలెం, ముక్కోడి పాలెం, కండ్రవారి పాలెం కలపటం వలన వార్డు యొక్క భౌగోళిక నైసర్గ స్వరూపం మారిపోయి ఎస్సీ ప్రజల రిజర్వేషన్స్ కోల్పోయే పరిస్థితి ఉంది.దీని వెంటనే సరి చేసి శ్రీరామ నగర్ కాలనీ చుట్టుపక్కల ఉన్న ఎస్సీ, బీసీ కాలనీలను కలిపి ఒకే వార్డు చేయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము. కందుకూరు మున్సిపాలిటీ లోని 30వ వార్డు (పాత 23 వార్డుల)పునర్విభజన ముసాయిదాలోముఖ్యంగా 23 వార్డును మైనార్టీ ప్రజలను బీసీ ప్రజలను విడగొట్టి మరొక కాలనీలో కలుపుట వలన మైనారిటీ వార్డు యొక్క ఐక్యతను విడగొట్టారు. తూర్పు వైపు ఉన్న మెజారిటీ ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా తొలగించటం వివక్షతో కూడుకున్నది. మెజార్టీ ప్రజల మనోభావాలకు భిన్నంగా ఉన్న ప్రాంతం కలుపుట వలన బీసీ రిజర్వేషన్ కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది. వార్డు సరిహద్దులను సరి చేయవలసినదిగా కోరుచున్నాము. మైనార్టీ ప్రజలను మూడు వార్డులలో విభజించడం వివక్షత చూపినట్లే విమర్శించారు. 29 వార్డులోని ప్రాంతాలను తొలగించి అడ్డదిడ్డంగా ఉన్న గాజులు కాలువ విజయనగర కాలనీ కలపటం వార్డ్ భౌగోళిక పరిస్థితిని దెబ్బతీయాలని సామాజిక వర్గాల మధ్య విభేదాలు వచ్చే విధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించాలని అన్నారు. పాత ఆరో వార్డులో ఒక మైనారిటీ ప్రజల లైను కావాలని ఉద్దేశపూర్వకంగా తొలగించి పక్క వార్డులో వేయటం వలన స్థానిక వైసీపీ నాయకులను ఇబ్బందులు పాలు చేయాలని దురుద్దేశం కనబడుతున్నట్లు ఉందని అన్నారు. మున్సిపల్ అధికారులపై వస్తున్న ఆరోపణలకు సరైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు రిజర్వేషన్ పట్ల, బూతులు పట్ల ప్రభావం ఉంటుందని రాజ్యాంగం ప్రకారం వారికి రక్షణ కల్పిస్తూ వారి ప్రాంతాల్లోనే బూతులు కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో దాదాపు 40 వార్డుల్లో ఇవే సమస్యలు ఈ పునర్విభజన వలన ఎదురవుతున్నాయని తక్షణం మున్సిపల్ అధికారులు సరి చేయకపోతే ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి తగిన విధంగా ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం మున్సిపల్ కమిషనర్ గారికి అన్ని వార్డుల నాయకులు తమ అభ్యంతరాలు తెలియజేస్తూ వినత పత్రాలను ఇవ్వడం జరిగినది ఆ సందర్భంగా కమిషనర్ చెప్పే సమాధానం సరైన వివరణాత్మకంగా లేనందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర నిరసన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, రావులకొల్లు బ్రహ్మానందం, కాకర్ల గోపాల్,వల్లూరు కోటేశ్వరరావు, గేరా మనోహర్, యరమాల నాగభూషణం,నగళ్ళ నారయ్య, ఉచ్చులూరి రవీంద్ర, తల్లపనేని గోపి, దేవిశెట్టి రాజేష్, పల్నాటి చెన్నయ్య,సాదు మాధవ, యడ్ల మాధవరెడ్డి, ద్రోణాదుల చైతన్య, షేక్ మస్తాన్ వలి, ఇజ్రాయిల్, కానాల శివప్రసాద్, కొచ్చర్ల మాల్యాద్రి,యల్లావుల మురళి పేయ్యల రమణయ్య, పరిశుద్ధ రావు, చనమాల కోటేశ్వరరావు, శ్రీరామ కుమారస్వామి, ముప్పరాజు శ్రీనివాసులు, మందలపు మహేష్, షేక్ ముజిబుల్ రెహమాన్, షేక్ నాయబ్,షేక్ హమీద్, థామష్, దండే రమేష్,హఫీజ్,షేక్ అల్లాబక్షు, ఉప్పుటూరి నాగేశ్వరరావు, షేక్ బాబ్జాన్,రావురీ శ్రీను,







విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రిటైర్డ్ టీచర్ ఇంట్లో భారీ అగ్నిప్రమాదం

రూ. 8 లక్షల ఆస్తి నష్టం అంచనా

ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్ గాలిబ్ సాహెబ్ నివాసంలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. మాచర్లలోని రామా టాకీస్ సమీపంలో ఉన్న ఆయన ఇంట్లో అక్టోబర్ 10వ తేదీ, రెండవ శనివారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్ గాలిబ్ సాహెబ్ మధ్యాహ్నం నమాజ్ చేసేందుకు మసీదుకు వెళ్లగా, ఆయన భార్య తన సోదరుడి ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగినట్లు తెలుస్తోంది. విద్యుత్ మీటర్ వద్ద ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంట్లోని ఏసీలు, టీవీలు, ఇతర విద్యుత్ పరికరాలు కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. ఇళ్లలో విద్యుత్ మీటర్లు, వైరింగ్, విద్యుత్ పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలని, తగిన విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని ఈ ఘటన సూచిస్తోంది.

ఘనంగా వరల్డ్ పాస్టర్స్ అప్రిసియేషన్ డే



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)

పాస్టర్ సేవలు ప్రపంచంలో వెలకట్టలేనిది అని పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు.పల్నాడు దైవ సేవకుల సహవాసం ఆధ్వర్యంలో వరల్డ్ పాస్టర్స్ అప్రిసియేషన్ డే (ప్రపంచ దైవ సేవకుల ప్రశంసా దినోత్సవం) వేడుకలు మాచర్లలోని సమర్పణ మందిరంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ దైవజనులు లిపాస్టర్ జాన్ వెస్లీ పాల్గొన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న సహవాస సేవకులు అందరూ ఈ వేడుకల్లో పాల్గొని ప్రపంచ శాంతి కొరకు, దైవ సేవకుల క్షేమం కొరకు, భారతదేశ శాంతి, సౌభాగ్యం కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ లిమోహన్ బాబు మాట్లాడుతూ 1992 లో అండర్ హిస్ వింగ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు జెర్రీ ఫ్రెయర్ జూనియర్ అనే వ్యక్తి, ఆఫీస్ సెక్రటరీలకు ఒక ప్రత్యేక దినోత్సవం ఉన్నప్పుడు, సమాజానికి ఆధ్యాత్మిక సేవలు అందించే దైవజనులకు ఎందుకు ఉండకూడదనే ఆలోచనతో ఈ దినోత్సవాన్ని ప్రతిపాదించారు. దీనిని అమెరికా ప్రభుత్వం ఆమోదించి, అప్పటి నుంచి నేటి వరకు ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటున్నాం" అని తెలియజేశారు. అనంతరం సీనియర్ దైవజనులైన షడ్రక్, జాన్ వెస్లీ, యెహోషువను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహంతో, ఐక్యతతో ముగిసింది.

రైతు నేస్తం క్లస్టర్ హైరింగ్ సెంటర్లు ఎమ్మెల్యే జూలకంటి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)

రైతుల పాలిట నేస్తం క్లస్టర్ హైరింగ్ సెంటర్లు అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో డీఆర్డీఏ వారి అయిన ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజింగ్ ప్రాజెక్ట్ ద్వారా రైతుల కోసం అందుబాటులో తీసుకొచ్చిన సీహెచ్‌సి కు సంబంధించిన నూతన ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ మొత్తంలో పరికరాలను అద్దెకు ఇచ్చి, చిన్న, సన్నకారు రైతులకు వెన్నుదన్నుగా సిహెచ్‌సి సెంటర్లు నిలుస్తున్నాయన్నారు. ఈ సెంటర్లును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయం మొత్తం యాంత్రీకరణ వైపు పరివర్తనం చెంది, కౌలు రైతులకు భారంగా మారిందని, ట్రాక్టర్, ట్రక్కు, రోటవేటర్, పవర్ వేటర్ వంటివి పలు వ్యవసాయ పనిముట్లు రైతులకు తక్కువ ధరకు అద్దెకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రంగారెడ్డి, ఎఫ్‌పీవో సిసి గురవయ్య, సీసీ లాలు, ఎంఎస్ ప్రెసిడెంట్ అనుషా, వీవోఏలు, రైతు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.





సీఐకి సత్కారం



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, అక్టోబర్ 12)

త్రిపురాంతకం సీఐ మాతంగి శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలిసిన పెద్దారవీడు మండల టీడీపీ నాయకులు పెద్దారవీడు మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పెద్దారవీడు మండల టీడీపీ నాయకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మెట్టు శ్రీనివాసరెడ్డి మండలంలోని పలు సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఆనెకాళ్ళ శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెన్నా వెంకటరెడ్డి, వెన్నా వెంగళ్‌రెడ్డి, సర్పంచ్ ఇండ్ల రామకృష్ణరెడ్డి, ఆకుమళ్ళ శ్రీనివాసరెడ్డి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి తిరుమలరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ పర్మినెంట్ మెంబర్ సంఘమిత్ర సిరాజుద్దీన్‌ను సన్మానించిన ప్రముఖ గురువు హజరత్ మహమ్మద్ షా అబ్దుల్ హక్



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 12)

అనాధలు, వికలాంగులు, నిరాశ్రయులను ఆదరిస్తూ తన వంతుగా వారికి దశాబ్దాలుగా సేవలు అందిస్తూ అనాధలు వికలాంగుల ఆశాజ్యోతిగా పేరుపొందిన షేక్ సంఘమిత్ర సిరాజుద్దీన్ ను మైదుకూరు ద్వారకా నగర్ లోని ఖాన్ కా– యే –హజరత్ సమీపిర్ మొహమ్మద్ షా అబ్దుల్ హక్ బాదుషా ఖాద్రీ అల్ చిష్తి ఆస్థానంలో ప్రముఖ గురువు హజరత్ మహమ్మద్ షా అబ్దుల్ హక్ శాలువా కప్పి పూలమాలవేసి సన్మానించారు. ఆధ్యాత్మిక చింతన తో పాటు నిరాశ్రయులకు వృద్ధులకు పేదవారికి వికలాంగులకు తన వంతుగా సేవ చేయాలనే దృఢ సంకల్పంతో సేవ చేస్తున్న సంఘమిత్ర సిరాజుద్దీన్ ను సన్మానించడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. నిస్వార్థంగా సేవ చేసేవారికి గుర్తింపు దక్కినప్పుడు, వారు మరింత బాధ్యతతో పనిచేయడానికి ఇది ప్రేరణనిస్తుందనీ గురువు హజరత్ మొహమ్మద్ షా అబ్దుల్ హక్ అన్నారు. ఒకరిని సన్మానించడం ద్వారా సమాజంలో సేవ పట్ల ఇతరులకు కూడా ఆసక్తి కలుగుతుందనీ, ఆర్థిక ప్రయోజనాల కంటే వారి సేవకు ఇచ్చే గౌరవం వారికి ఎంతో మానసికబలాన్ని ఇస్తుందనీ ఆయన అన్నారు. ప్రచారం కోసం కాకుండా, నిజంగా వెనుకబడిన వర్గాల వారికి అనాధలకు నిరాశ్రయులకు వికలాంగులకు సంఘమిత్ర సిరాజుద్దీన్ దశాబ్దాలుగా సేవ చేస్తున్నారని ఆయన కొనియాడారు.

పాత మార్కెట్ సెంటర్‌లో
ప్రజా సంఘాల నాయకుల అరెస్టు











(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 12)
ధర్నాలో పాల్గొనేందుకు ర్యాలీగా వచ్చిన ప్రజా సంఘాల నాయకులను ఒంగోలు పాత మార్కెట్ సెంటర్ వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కంకణాల ఆంజనేయులు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ చిష్టి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నేరుసుల వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జుజ్జూరి జయంతి బాబు, సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఉన్నారు. అలాగే ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కె రాజేశ్వరి, వీరాస్వామి, సీఐటీయూ నగర కార్యదర్శి టి మహేష్, టి రాము, ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్ వినోద్, బి వీరస్వామి, ఆవాజ్ నాయకులు ఎస్‌డి హుస్సేన్, తదితరులను అదుపులోకి తీసుకున్నారు. పలువురు మాట్లాడుతూ తౌషిక్ మృతి మౌలాభి మరణానికి దారి తీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యతలను గుర్తించి చట్టప్రకారం శిక్షించాలని కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాము ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.





రానున్న ఎన్నికలలో విజయదుందిబి మోగిద్దాం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)
పార్టీ విజయమే పరమావధిగా భావించాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు పి ఆర్ కె రానున్న స్థానిక ఎన్నికల్లో వైసీపీ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడమే తమ ధ్యేయంగా భావించి అందుకు ప్రతి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని అప్పుడే విజయం సాధిస్తామని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మండల కేంద్రమైన రెంటచింతలోని శివాలయం కల్యాణ మండపంలో వైసీపీ నేతలకు కార్యకర్తలకు ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల వైసీపీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. పీఆర్కే తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఐడి కార్డులు ఇవ్వడం వలన ప్రతి కార్యకర్తకు నాయకులకు గుర్తింపు హోదా లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అభ్యర్థి ఎవరైనాప్పటికీ కూడా విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసిపి చెందిన మాజీ జడ్పిటిసి నవ్వులూరి భాస్కర్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, ముత్తయ్య యాదవ్, సౌరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి సిఐ గా సుబ్రహ్మణ్యం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 12)
కనిగిరి నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు రేంజ్ ఆఫీస్ నుండి బదిలీ పై కనిగిరి రావడం జరిగింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సిఐ ఉప్పు శ్రీనివాసులును గుంటూరు రేంజ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు.

పేపర్ ప్రజెంటేషన్‌లో రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానంలో బహుమతి పొందిన షేక్ మౌలాలి

రాష్ట్ర ఎస్టీయూ సంఘం ఉపాధ్యక్షులు ఎర్రయ్య, పలువురి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 12)
రాష్ట్ర స్థాయిలో ఎస్టియు సంఘం ఉపాధ్యాయులకు నిర్వహించిన వివిధ పోటీలైన ఉపాధ్యాయిని, సామాజిక బాధ్యత, పాఠశాల, సమాజ అనుసంధానం, సామాజిక అవగాహనలాంటి అంశాల పై నిర్వహించిన పోటీలలో మార్కాపురం జిల్లా, తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు పంచాయతీలో గల లింగారెడ్డి కాలనీలోని మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న షేక్ మౌలాలి ప్రదర్శించిన పేపర్ ప్రజెంటేషన్ పై ద్వితీయ బహుమతికి ఎంపికైనట్లు సమాచారం అందడంతో రాష్ట్ర ఎస్టీయూ సంఘం ఉపాధ్యక్షులు కే ఎర్రయ్య, పలువురు ఉపాధ్యాయులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయనను అభినందించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లంకొండ వెంకట రమణకు ఆహ్వానపత్రిక అందజేత



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 12)
ఈశ్వరీ దేవి ఆశ్రమం పీఠాధిపతి గోవిందందిన్నె సుబ్బరాయుడు స్వామి సోమవారం సాయంత్రం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, పలువురు కమిటీ సభ్యులకు దసరా మహోత్సవం ఆహ్వాన పత్రికను అందజేశారు. దసరా ఉత్సవాలకు విచ్చేసి స్వామి వారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును పరిశీలిస్తున్న బ్యంగా రమణారావు
మాచర్ల అభివృద్ధి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తోనే సాధ్యం
బ్యంగా రమణారావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 12)
మాచర్ల అభివృద్ధి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు 3, 4, 5 వార్డుల ఇన్చార్జి బ్యంగా రమణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో, నాయకులు గట్ల కోటిరెడ్డి, షేక్ మస్తాన్, షేక్ ఖాసిం తో కలిసి ఆయన పర్యటించారు. అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో సమస్యలను గుర్తించిన మరుక్షణమే వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కృషి చేస్తున్నారన్నారు. 4వ వార్డులో ఇంటి వాకిలికి ఎదురుగా ఉన్న విద్యుత్ స్థంభంతో 15 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న సమస్యను తెలిసిన మరుక్షణమే స్తంభాన్ని మార్చి సమస్యను పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికే దక్కుతుందన్నారు. హై క్వాలిటీ తో వార్డులలో సిసి రోడ్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పాలన పట్ల ఆయా వార్డుల ప్రజలంతా విశ్వాసంతో ఉన్నట్లు తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు బుగ్గవాగు నుండి పైపులైన్ ద్వారా మంచినీటిని త్వరలో ఇంటింటికి అందించబోతున్నారన్నారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణా పనుల తోపాటు, పల్నాటి వాసులకు 7 దశాబ్దాలుగా కలగా మిగిలిన వరికపూడిసెల ప్రాజెక్టు పనులను కూడా త్వరలో ప్రారంభించి ప్రజల హృదయాలలో నిలుస్తారన్నారు. రేపటి ఎన్నికల్లో టిడిపి నూరు శాతం విజయం సాధిస్తుందని ఆయన తెలిపారు. నిత్యం వార్డులలో పర్యటించి ప్రజా సమస్యలపై స్పందిస్తున్న నాయకులు గట్ల కోటిరెడ్డి, షేక్ మస్తాన్, ఖాసింలను ఆయన ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు షేక్ ఇస్మాయిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసౌకర్యంగా మారిన ఇసుక దిబ్బలు
కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 12)
బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని అశోక్ నగర్ 3వ రోడ్డులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పక్క వీధిలో సిసి రోడ్డు నిర్మాణం కోసం తీసుకువచ్చిన ఇసుక, ఇతర నిర్మాణ సామాగ్రిని అశోక్ నగర్ 3వ రోడ్డులోనే రోడ్డంతా పరుచుకునేలా తోలి వదిలేశారు. దీంతో రోడ్డంతా ఇసుకమయమై వాహనాలు జారిపడే ప్రమాదం ఏర్పడింది. కనీసం నడవడానికి కూడా దారి లేక చిన్న పిల్లలు,వృద్ధులు, స్థానికులు ఇసుకలోనే నడుస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ నియంత్రణ కోల్పోయి కిందపడిపోతున్నారని వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా, సమస్య పరిష్కరించాల్సింది పోయి దురుసుగా ప్రవర్తించారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే కాంట్రాక్టర్లు ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, రోడ్డుపై వేసిన ఇసుకను తొలగించి రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని అశోక్ నగర్ 3వ రోడ్డు నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అశోక్ నగర్‌లో రోడ్డు పై ఇసుకను తరలించాలి
మేదాహల్ భార్గవ్, అశోక్ నగర్ వాసి, బద్వేల్



మున్సిపాలిటీ పరిధి అశోక్ నగర్ మూడో రోడ్డులో సీసీ రోడ్డు కోసమని పక్క వీధిలో సిసిరోడ్ పనుల కోసం మా విధి రోడ్డుపై ఇసుక ట్రిప్పులు వదిలి వెళ్ళడంతో ఆ ఇసుక తో రోడ్డంతా పరిచినట్లుగా ఉండి రహదారిలో వాహనదారులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కావున మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఇసుకను బయటికి తరలించాలి.



వీధిలోకి వాహనాలు రావాలంటేనే ఇబ్బందులు
సగల కళ్యాణ్, అశోక్ నగర్ వాసి

మున్సిపాలిటీ పరిధి అశోక్ నగర్ మూడవ రోడ్డులోకి వాహనాలు రావాలంటేనే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రోడ్డుపై ఇసుక కుప్పలు ఉండడంతో రోడ్డంతా ఇసుకమయంగా మారి రోడ్డుపై వాహనాలు పాదాచార్యులు రావాలంటేనే అనేక ఇబ్బందులు పడుతున్నాం. కాంట్రాక్టర్ కి తెలియచేసినా వారు నిర్లక్ష్యంగా ఉన్నారు. కావున మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని రోడ్డు పై అడ్డంగా ఉన్న ఇసుక కుప్పలను బయటికి తరలించాలి.